ప్రజాశక్తి

సోమవారం 29 డిసెంబర్ 2025 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

విలీనం పంచాయితి!

- కార్పొరేషన్‌లో గ్రామాల విలీనంపై టిడిపిలో విభేదాలు
- తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ ఎమ్మెల్యే మాధవి బహిరంగ ప్రకటన
- కేంద్ర మంత్రి, మేయర్ సమక్షంలోనే అసంతృప్తి
- పెదకాకాని గ్రామాలను కలిపే ప్రసక్తే లేదు : ఎమ్మెల్యే నరేంద్ర

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు కార్పొరేషన్‌లో పరిసర మండలాలకు చెందిన గ్రామాలను విలీన ప్రతిపాదన నేపథ్యంలో అధికార టిడిపిలో గ్రూపు విభేదాలను మరోసారి బట్టబయలు చేసింది. మేయర్‌కు ఎమ్మెల్యేలకు మధ్య గత కొంతకాలంగా అంతర్గతంగా కొనసాగుతున్న విభేదాలు ఆదివారం కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సమక్షంలోనే గళ్లా మాధవి తన గళం విన్పించారు. ఆదివారం గుంటూరులోని 28వ డివిజన్‌లో అర్బన్ హెల్త్ సెంటర్ శంకుస్థాపన చేసిన సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మేయర్ కోవెలమూడి రవీంద్ర సమక్షంలోనే ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ గ్రామాల విలీనం ప్రతిపాదనలను తాను వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. అంతేగాక తాను సమావేశానికి హాజరుకాకున్నా తాను కూడా ఈ ప్రతిపాదనలను ఆమోదించినట్టు, పెదకాకాని గ్రామాన్ని తాను కలపమన్నట్టు మేయర్

రవీంద్ర కౌన్సిల్ సమావేశంలో ప్రకటించడంపై తాను అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు. కౌన్సిల్ సమావేశానికి రెండు రోజుల ముందు ముగ్గురు ఎమ్మెల్యేలతో మేయర్ సమావేశం నిర్వహించగా తాను అప్పుడే విలీన ప్రతిపాదనలను వ్యతిరేకించిన్నట్టు వివరించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు 11 గ్రామాలను ప్రతిపాదించగా మరో ఆరు గ్రామాలను కలుపుతున్నట్టు మేయర్ చెప్పారని కానీ ఆదరాబాదరగా చేయాల్సిన అవసరం లేదని గ్రేటర్ చేయాలంటే ఏయే గ్రామాలు కలపాలో పూర్తిగా అధ్యయని చేయాల్సి ఉందని తాను చెప్పినట్టు మాధవి తెలిపారు.

విలీన గ్రామాల అంశంపై ఆమె మీడియాతో మాట్లాడుతుండగా పెమ్మసాని పక్కనే ఉన్నా వారించలేదు. మేయర్ రవీంద్ర ఆమె వెనుక ఉన్నారు. ఆయన కూడా గళ్లా మాధవి వ్యాఖ్యలను ఖండించలేదు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నశీర్ కూడా ఉన్న 57 డివిజన్లకు సౌకర్యాలు ▶ 2లో

వక్ఫ్ భూములను కార్పొరేట్‌లకు కట్టబెటొద్దు

విలేకర్లతో మాట్లాడుతున్న నేతాజి, ఇతర నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

ముస్లిముల అభ్యున్నతి, సంక్షేమం కోసం వినియోగించాల్సిన వక్ఫ్‌భూముల్ని పారిశ్రామిక కారిడార్ పేరుతో కార్పొరేట్ సంస్థలకు కట్టపెట్టడాన్ని విరమించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. బ్రాడీపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు, ఈమని అప్పారావు, మంగళగిరి రూరల్ మండల కార్యదర్శి యు.దుర్గారావుతో కలిసి నేతాజి ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. మంగళగిరి రూరల్ మండలం, చినకాకాని పరిధిలోని విలువైన, మూడు పంటలు పండే సర్వేనం.201 ఎ నుండి 204 డి వరకు ఉన్న 71.57 ఎకరాలను పారిశ్రామిక కారిడార్ పేరుతో సేకరించడానికి నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. ఈ భూమిని సిపిఎం జిల్లా ప్రతినిధి బృందం పరిశీలించి, భూములను సాగుచేస్తున్న రైతులతో మాట్లడిందని చెప్పారు. 70 ఏళ్ల నుండి వక్ఫ్‌బోర్డు పరిధిలో ఉందని, అప్పటి నుండి షుమారు 100 మంది పేద రైతులు సాగుచేసుకుంటూ అంజుమన్ కమిటీకి కౌలు చెల్లిస్తున్నారని తెలిపారు. రైతులు 16 ఏళ్ల నుండి భూమిని అభివృద్ధి చేసుకుంటూ బోర్లు తవ్వుకోవటం, సోలార్ విద్యుత్ టవర్లు బిగించుకుని, రకరకాల వ్యాపార పంటలు పండిస్తూ జీవనం సాగిస్తున్నారని చెప్పారు. నూతనంగా నిర్మించే హైవేకు ఆనుకొని ఉన్న ఈ భూమిపై ప్రభుత్వం కన్ను పడిందన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్రభుత్వ అవసరాలు, పారిశ్రామిక అవసరాలకు సేకరించేటప్పుడు ప్రాధాన్యతా క్రమంలో బీడు భూములుగా వున్న వాటిని సేకరించాలనే నిబంధనను పక్కన పెట్టారన్నారు. వక్ఫ్ బోర్డుకు కేటాయించిన భూములు విక్రయించటానికి, కొనడానికి, ▶ 2లో

ధర్నాలో పాల్గొన్న సిపిఎం, వివిధ సంఘాల నాయకులు

ప్రజా ఉద్యమకారులపై పి.డి యాక్టు అప్రజాస్వామికం

కలెక్టరేట్ ఎదుట సిపిఎం, ప్రజాసంఘాల ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు

అనకాపల్లి జిల్లాకు చెందిన సిపిఎం నాయకులు అప్పలరాజుపై పీడీ యాక్టు మోపి అరెస్టు చేయటాన్ని నిరసిస్తూ సిపిఎం నగర కమిటీ, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడుతున్న అప్పలరాజుపై రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన పీడీ యాక్టును రద్దుచేసి, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో సిఎం మడకశిర పర్యటన సందర్భంగా సిపిఎం నాయకులను గృహనిర్బంధం చేసినప్పుడు మంత్రి నారా లోకేష్ సోషల్ మీడియాలో 'సారీ కామ్రేడ్' అని చెప్పి, పోలీసులు గత ప్రభుత్వ హాయంలో మాదిరిగా వ్యవహరిస్తున్నారని, భవిష్యత్తులో అరెస్టులు, గృహ నిర్బంధాలు ఉండవు అని ప్రకటించారని గుర్తుచేశారు. కానీ నేడు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని, ప్రజా సమస్యలపై పోరాడే నాయకులపై పీడీ యాక్ట్ వంటి దుర్మార్గపు చట్టాలను ప్రయోగించటం ఈ ప్రభుత్వ దమన నీతికి నిదర్శనమని మండిపడ్డారు. గత వైసిపి ప్రభుత్వంలో జీవో 100 తెచ్చి ప్రజా ఉద్యమాలపై నిర్బంధాలు చేశారని, కూటమి ప్రభుత్వం కూడా ఆ జీవోను కొనసాగిస్తూ నిర్బంధాలు కొనసాగిస్తోందని అన్నారు. ప్రజా ఉద్యమాలపై, నాయకులపై నిర్బంధాలు చేస్తే ఉద్యమాలు ఇంకా ఉవ్వెత్తున సాగుతాయని హెచ్చరించారు. అనంతరం వివిధ ప్రజా సంఘాల నాయకులు ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ, సిఐటియు నగర కన్వీనర్ బి.ముత్యాలరావు, ఆటో యూనియన్ నగర కార్యదర్శి జి.శంకరరావు, మెడికల్ రిప్రజెంటెటీవ్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మల్లికార్జునరావు, రేట్ పేయర్స్ అసోసియేషన్ నాయకులు సదాశివరావు తదితరులు ప్రసంగించారు. సిపిఎం నాయకులు షేక్ ఖాశీం షహీద్, షేక్ ఖాశీంవలి, షేక్ మస్తాన్‌వలి, పి.సాంబశివరావు, బి.సత్యయ్య, షేక్ బాషా, జి.లూథర్‌పాల్, షేక్ షకీల, రాజేశ్వరరావు, ఎల్.ఎస్.భారవి, కె.శ్రీనివాసరావు, కె.నాగేశ్వరరావు, కె.సుధీర్, శంకరరావు, శ్రీహరి, జె.చిన వెంకటస్వామి, టి.రాజేష్ పాల్గొన్నారు.

సిఆర్‌డిఎ కార్యాలయం వద్ద నేడు సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - తుళ్లూరు

మందడంలో ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఆందోళనకు గురై గుండెపోటుతో మృతి చెందిన దొండపాటి రామారావు కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, అమరావతి రైతులకు న్యాయం చేయాలని, వారు కోరుకున్నచోట ప్లాట్లు ఇవ్వాలని, రాజధాని ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజధానిలోని రాయపూడి సిఆర్‌డిఎ కార్యాలయం వద్ద మధ్యాహ్నం 2 గంటలకు ధర్నా చేసి అధికారులకు అర్జీ అందజేస్తామని, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, సిపిఎం జిల్లా నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు.

లోపలి పేజీల్లో...

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి

సిఐటియు జాతీయ మహాసభల జయప్రదం కోసం ప్రచారం

10, 11 తేదీల్లో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి చంద్రశేఖర్, ఎమ్మెల్యే మాధవి, మేయర్ రవీంద్ర తదితరులు

తాగునీటి సమస్యలకు పరిష్కారం

బిఆర్ స్టేడియం వద్ద స్టోరేజి ట్యాంకుకు శంకుస్థాపనలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ - 28 డివిజన్‌లో అర్బన్ పిహెచ్‌సికి శంకుస్థాపన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని బిఆర్ స్టేడియంలో నూతన ఎలివేటెడ్ స్టోరేజ్ లెవెల్ ట్యాంక్ నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్‌తో కలిసి మంత్రి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు నగరం పరిసర ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకు ఉపయోగపడుతున్న ఎలివేటెడ్ స్టోరేజ్ లెవల్ ట్యాంకుల పునర్నిర్మాణంలో నాణ్యతకే అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని, గుంటూరు చుట్టుపక్కల ప్రాంతాలో 40 ఏళ్ల క్రితం నిర్మించిన అనేక ఎలివేటెడ్ స్టోరేజ్ ట్యాంకుల్లో ప్రస్తుతం తీవ్ర నిర్మాణ లోపాలు కనిపిస్తున్నాయని చెప్పారు. అప్పట్లో రూఫ్ డిజైన్, ప్లాస్టరింగ్, రూఫ్ మందం వంటి అంశాలను సరైన విధంగా పరిగణలోకి తీసుకోకపోవడం వల్ల ఇప్పుడు రూఫ్‌లు దెబ్బతిన్నాయన్నారు. చాలా ట్యాంకుల్లో రూఫ్ మందం తక్కువగా ఉండటం, లోపల ప్లాస్టరింగ్ చేయకపోవడం, క్లోరిన్ వంటి రసాయనాల ప్రభావంతో ఐరన్ ఎక్స్‌పోజ్ కావడం వల్ల నిర్మాణ నష్టం జరిగిందన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఫౌండేషన్‌కు సంబంధించిన సమస్యలు కూడా ఉన్నట్లు గుర్తించామని, కొత్త డిజైన్‌తో ట్యాంకులను నిర్మించాలని నిర్ణయించామని ▶ 2లో

చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ఉపేక్షించం

ప్రజాశక్తి- తాడేపల్లి : ఎంతటి వారైనా చట్టాలకు లోబడి ఉండాల్సిందేనని, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటే ఉపేక్షించబోమని తాడేపల్లి మహిళా ఎస్సై హెచ్చరించారు. ఆదివారం తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో పోలీస్ రికార్డ్ లకెక్కిన, వివిధ నేరాలతో సంబంధం ఉన్న వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా ఎవరి పనులు వారు చేసుకుంటే మంచిదని సూచించారు. సెటిల్మెంట్లు, దందాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో పోలీస్ రికార్డులు ఎక్కిన, ప్రస్తుతం సత్ప్రవర్తనకలిగి ఉన్న వారిపై కేసులు ఎత్తివేసే ఆలోచన ఉన్నతాధికారులున్నట్లు చెప్పారు.

ప్రజాశక్తి - నకరికల్లు : సత్ప్రవర్తనతో మేలుగుతూ ప్రశాంతంగా జీవించాలని రౌడీషీటర్లను ఎస్సై సతీష్ ఆదేశించారు. రౌడీషీట్లకు, పాత నేరస్తులకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, ముఠాలుకట్టి ప్రజలను ఇబ్బందులు పెట్టిన, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్లపై నిరంతరం నిఘా ఉంటుందని, నిబంధనలు మీరితే సహించబోమని అన్నారు.

250 మందికి సాయికృష్ణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్ : మండలంలోని నందిగామ గ్రామంలో సాయికృష్ణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో సింగరాజు చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ సింగరాజు సాయికృష్ణ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు, విషజ్వరాలు పట్ల తీసుకువాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా సుమారు 250 మందికి బీపీ, షుగర్, జ్వరాలు, నెమ్ము, ఆయాసం, ఉబ్బసం, జలుబు, దగ్గు, థైరాయిడ్ సమస్యలు తదితర అన్ని రకాల జనరల్ వ్యాధులకు ఊపిరితిత్తుల వ్యాధులకు ఉచితంగా (ఈసీజీ షుగర్, థైరాయిడ్ ప్రొఫైల్, హెచ్‌బి 1 ఎసి) పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బలిజెపల్లి రమాదేవి, ఆళ్ళ అమరేశ్వరరావు, ఆళ్ళ సాంబయ్య, బలిజెపల్లి విజయకుమార్, పులిగడ్డ నాగాంజనేయులు, మార్కెండయులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి - పెదకాకాని : స్థానిక ఎన్‌ఆర్‌ఐ, మాజీ పెదకాకాని శివాలయం ఛైర్మన్ బండారు సుబ్బారావు కుమారుడు బండారు అశోక్ కుమార్ నెలకొల్పిన స్కిల్ డెవలప్మెంట్ సంస్థ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో బిఎస్‌ఆర్ స్కిల్ డెవలప్మెంట్ సంస్థను స్థాపించామన్నారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఆదివారం తన భార్య జయలక్ష్మితో వెళ్లి కలిశారు. మారుతున్న టెక్నాలజీని ప్రతి ఒక్కరికి అందుబాటులోకి తేవడానికే తాము స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమం చేపట్టామన్నారు. తన భార్య జయలక్ష్మి ఐరోపాలో రెడ్‌క్రాస్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించిన అనుభవం ఉంది అన్నారు.తన తండ్రి బండారు సుబ్బారావు స్ఫూర్తితో సామాజిక సేవ లక్ష్యంతో రాష్ట్రానికి చెందిన వేలాదిమంది పట్టభద్రులకు జీవితంలో స్థిర పడటానికి కావలసిన నైపుణ్య శిక్షణను అందించి వారి ఆర్థిక అభివఅద్ధికి కఅషి చేస్తామని తెలియజేశారు.

మంగళగిరి ప్రీమియర్ లీగ్-4 పోటీల్లో జోష్

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి, మంగళగిరి శాసన సభ్యులు నారా లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళగిరి పట్టణంలోని నారా లోకేష్ క్రీడా ప్రాంగణం(బోగి ఎస్టేట్స్)లో జరుగుతున్న మంగళగిరి ప్రీమియర్ లీగ్ -4 పోటీలు క్రీడాకారుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. నియోజకవర్గ స్థాయిలో జరుగుతున్న ఈ పోటీల్లో క్రీడాకారులు తమ సత్తా చాటుతున్నారు. 8వ రోజు డీడీ వారియర్స్ వర్సెస్ రైజింగ్ టై టాన్స్ టీమ్ జట్టుల మధ్య జరిగిన మ్యాచ్ లో డీడీ వారియర్స్ జట్టు విజయం సాధించింది. లెవెన్ వోల్ఫ్స్ వర్సెస్ ఎల్లో వారియర్స్ జట్టుల మధ్య జరిగిన మ్యాచ్ లో లెవెన్ వోల్ఫ్స్ జట్టు గెలుపొందింది. విక్కీ లెవెన్ వర్సెస్ స్పెన్సర్స్ లెవెన్ బుల్లెట్స్ జట్టుల మధ్య జరిగిన మ్యాచ్ లో విక్కీ లెవెన్ జట్టు, టీమ్ ఎన్టీటీ వర్సెస్ ట్రూ ఫ్రెండ్స్ టీమ్ జట్టుల మధ్య జరిగిన మ్యాచ్‌లో టీమ్ ఎన్టీటీ జట్టు, కాలనీ కుర్రోళ్ళు వర్సెస్ అరవపల్లి శ్రీనివాసరావు యూత్ జట్టుల మధ్య జరిగిన మ్యాచ్ లో కాలనీ కుర్రోళ్ళు జట్టులు విజయం సాధించాయి. ప్రతి మ్యాచ్ లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచిన క్రీడాకారుడికి మాన్ అఫ్ ది మ్యాచ్‌గా మంగళగిరి మార్కెట్ యార్డ్ ఛైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ సహకారంతో రూ.3 వేల బహుమతిని అందజేశారు.

తాగునీటి సమస్యలకు పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. కొత్త ట్యాంకుల్లో రూఫ్ మందాన్ని సుమారు 50 శాతం పెంచి, లోపల పూర్తిగా ప్లాస్టరింగ్ చేసి, ఎపాక్సీ పెయింటింగ్ చేయడం ద్వారా దీర్ఘకాలిక స్థిరత్వం కల్పించాలనుకుంటున్నామని లక్షల మంది ప్రజల తాగునీటి అవసరాలకు ఉపయోగపడే ఈ ట్యాంకులు కనీసం 50 సంవత్సరాలు నిలబడేలా నిర్మించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అందుకే కాంట్రాక్టర్లకు నాణ్యత విషయంలో రాజీ ఉండకూడదన్నారు. ప్రభుత్వ యంత్రాంగంతో పాటు ప్రైవేట్ సిటిజన్స్ కూడా పర్యవేక్షణలో భాగస్వాములు కావాలని సూచించామన్నారు. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం నిర్మించిన ట్యాంకును పున్ణ నిర్మాణం చేసేందుకు మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ నిధులు మంజూరు చేయించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.4.5 కోట్లతో ఈ రిజర్వాయర్‌ను నిర్మాణం చేపట్టాలని నిర్ణయించామని తెలిపారు. ఆర్టీసీ కాలనీ వైపు మరో ట్యాంకు నిర్మాణం చేస్తామన్నారు. మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ బీఆర్ స్టేడియం వద్ద ఎలివేటెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణం ఏడాదిలో పూర్తి చేస్తామన్నారు. రానున్న రోజుల్లో అమృత్-2 పథకం కింద గుంటూరు ప్రజలకు తాగునీరు అందిస్తామన్నారు.

28 డివిజన్‌లో అర్బన్ పిహెచ్‌సికి శంకుస్థాపన

గుంటూరులో పేదలకు అందుబాటులో ఉండేలా అర్బన్ హెల్త్ సెంటర్లు పటిష్టపరుస్తున్నట్లు మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 28వ డివిజన్లో రూ.కోటితో నిర్మించనున్న పట్టణ ఆరోగ్య కేంద్రానికి స్థానిక ఎమ్మెల్యే గళ్లా మాధవితో చంద్రశేఖర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గుంటూరు అర్బన్ హెల్త్ సెంటర్లు సరిగా పనిచేస్తే జిజిహెచ్‌పై భారం తగ్గుతుందన్నారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ అభివృద్ధి పనులు చేస్తున్నా తాగునీరు, చెత్త, దోమల సమస్య, రహదారులు, పార్కులు, కమ్యూనిటీ హాళ్లు వంటి అంశాలింకా పరిష్కరించాల్సి ఉందన్నారు. కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, కమిషనర్ పి.శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, ఇండస్ట్రియల్ కార్పొరేషన్ ఛైర్మన్ దేగల ప్రభాకర్, కార్పొరేటర్ షేక్ మీరావలి, లిడ్ క్యాప్ కార్పొరేషన్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు, జనసేన, బిజెపి జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, చెరుకూరి తిరుపతిరావు, కార్పొరేషన్ ఎస్‌ఈ సుందర రామిరెడ్డి పాల్గొన్నారు.

చదువు భవిష్యత్తుకు వేసే పునాది

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : చదువు కోసం వేసే ప్రతి అడుగు - భవిష్యత్తుకు వేసే పునాదని బాలకుటీర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ నన్నపనేని మంగాదేవి అన్నారు. వజ్రోత్సవాల సందర్భంగా ఆదివారం వాక్ ఫర్ ఎడ్యుకేషన్, హెల్త్ అండ్ పీస్' కార్యక్రమాన్ని మంగాదేవి ప్రారంభించారు. మంగాదేవి మాట్లాడుతూ విద్య, ఆరోగ్యం శాంతి వంటి సమాజానికి అత్యంత కీలకమైన అంశాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు 5కే రన్‌ను నిర్వహించామని అన్నారు. విద్య ప్రాధాన్యత, ఆరోగ్యకర జీవనశైలి అవసరం, సమాజంలో శాంతి స్థాపన వంటి అంశాలపై ప్రజలకు సందేశం ఇవ్వడం ముఖ్య లక్ష్యమని సీఈవో దుర్గా రఘురాం అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో జయశ్రీ, మరుద్వతి పాల్గొన్నారు. తొలుత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సుమారు వెయ్యి మంది ఐదున్నర కిలోమీటర్ల వాక్‌లో పాల్గొన్నారు.

వక్ఫ్ భూములను కార్పొరేట్‌లకు కట్టబెటొద్దు

(మొదటి పేజీ తరువాయి)

సేకరించడానికి చట్టం అంగీకరించదన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టంలో తెచ్చిన మార్పులను ఆధారం చేసుకుని ఈ చర్యకు పాల్పడం అన్యాయమన్నారు. వక్ఫ్ భూమిని ముస్లిముల అభ్యున్నతికి, ముస్లిమ్ సంస్థల అభివృద్ధికే వినియోగించాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ముస్లిముల్లోని పేదలకు చెందాలని, రాజధాని ప్రాంతంలోను, జిల్లాలో ఇళ్ల స్థలాల్లేని ముస్లిమ్ పేదలు పెద్ద సంఖ్యలో వున్నారని, అవసరం అయితే వారికి ఇళ్ల స్థలాల కోసం కేటాయించాలని కోరారు. ప్రభుత్వం పునరాలోచన చేసి నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే ఆందోళనకు పూనుకుంటామన్నారు. న్యాయస్థానం కూడా జోక్యం చేసుకుని ప్రభుత్వ నిర్ణయాన్ని అడ్డుకోవాలని కోరారు. ఎన్నికల ముందు ముస్లిముల అభ్యున్నతి కోసం కృషి చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని, అర్హులైన ముస్లిముల్లోని పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాలలో 2 సెంట్లు ఇళ్ల స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు రుణం ఇప్పించాలని కోరారు.

విశ్వకర్మ వేద విజ్ఞానం గ్రంథ ఆవిష్కరణ

ప్రజాశక్తివిజయవాడ

ఆంధ్ర రాష్ట్ర దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజం, శ్రీ వీరబ్రహ్మేంద్ర దేశీయ విశ్వబ్రాహ్మణ అసోసియేషన్ (ఎస్వీబీడీ వీబీ) విశాఖపట్నం సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరు అరండల్ పేటలోని శ్రీ విరాట్ విశ్వకర్మ సామాజిక ప్రాంగణంలో ఆదివారం ఉదయం "విశ్వకర్మ - వేదవిజ్ఞానము " గ్రంథావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సభకు ఆంధ్ర రాష్ట్ర దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజం అధ్యక్షులు జంపని రాధాకఅష్ణమూర్తి అధ్యక్షత వహించారు. విశిష్ట అతిథి గా వీవీఐటీ ప్రొఫెసర్ ఆచార్య తియ్యబిండి కామేశ్వరరావు పాల్గని గ్రంథ ఆవిష్కరణ చేసారు. ప్రొఫెసర్ మురుగుడు శ్రీవారి మాట్లాడుతూ వేదాధ్యయనం వలన హఅదయ నిర్మల్యం ఏర్పడుతుందని, విశ్వకర్మ విశ్వతోముఖుడు వివరించారు. డాక్టర్ నాగార్జున కొండ సుందరాచారి మాట్లాడుతూ "విశ్వకర్మ" ఒక వ్యక్తి కాదు ఒక శక్తి అని, మానవుడు తప్ప సకల జీవ కోటి సుఖముగా ఆనందముగా జీవిస్తున్నాయని అన్నారు. గ్రంథ సంకలన కర్త మరియు సమర్పకులు కొండపి వేంకట గణేష్ బాబు మాట్లాడుతూ వేదాలలోని వాస్తవ విషయాలను సమాజానికి తెలియచేయాలనే సంకల్పంతో తన తండ్రి గారైన కీర్తి కాయులు బ్రహ్మశ్రీ డాక్టర్ కొండపి నాగేశ్వరరావు స్థాపించిన శ్రీ వీరబ్రహ్మేంద్ర దేశీయ విశ్వబ్రాహ్మణ అసోసియేషన్ (ఎస్ వీబీడీవీబీ) విశాఖపట్నం 40వ (రూబీ) వార్షికోత్సవం సందర్భంగా ఈ ఆవిష్కరణ జరిపినట్టు చెప్పారు. ఆ సంఘం ప్రధాన కార్యదర్శి కందుకూరి శ్రీనివాస సుధాకర్ బాబు తో పాటు కార్యక్రమంలో పాల్గన్న పాలక కార్యవర్గ సభ్యులు, అతిథులు, పాల్గన్న ప్రతి ఒక్కరికీ గణేష్ బాబు ఈ సందర్భంగా ధన్యవాదములు తెలిపారు.

విలీనం పంచాయితీ!

(మొదటి పేజీ తరువాయి)

కల్పించలేక అల్లాడుతుంటే కొత్త గ్రామాల కలపడాన్ని వ్యతిరేకించినట్టు తెలిసింది. పరిపాలనపరమైన ఇబ్బందులను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. అయితే మేయర్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యేలు నశీర్, మాధవి సానుకూలంగా ఉన్నారని చెప్పి తీర్మానం ఆమోదింప చేయడం మరో వివాదానికి తెరతీసినట్టు అయ్యింది. పెదకాకాని మండలంలో నాలుగు గ్రామాలను కలపాలన్న ప్రతిపాదనను ఎమ్మెల్యే దూళ్లిపాళ్ల నరేంద్ర వ్యతిరేకిస్తున్నారు. పొన్నూరు నియోజకవర్గంలోని 4 గ్రామాలను కార్పొరేషన్‌లో ఎందుకు కలపాలని ఆయన ప్రశ్నిస్తున్నారు. కమిషనర్ పులి శ్రీనివాసులు ఈ ప్రతిపాదనను తనకు చెప్పగా ఆదిలోనే వ్యతిరేకించినట్టు ఎమ్మెల్యే నరేంద్ర తెలిపారు. దీంతో నగరానికి సమీపంలో ఉన్న గ్రామాలను కలపకుండా 12 కిలో మీటర్ల దూరంలో ఉన్న జొన్నలగడ్డ వంటి గ్రామాలను కలిపడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. కౌన్సిల్ సమావేశంలో వైసిపి విలీన గ్రామాల ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నట్టు ప్రకటించగా అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే రామాంజనేయులు పరోక్షంగా దెప్పిపొడిచారు. తీరా సొంత పార్టీ ఎమ్మెల్యేలే విలీనగ్రామాల ప్రతిపాదనలను వ్యతిరేకిస్తున్నట్టు బహిరంగంగా ప్రకటించడంతో మేయర్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు, అధికార యంత్రాంగం మొత్తం ఆత్మరక్షణలో పడినట్టు అయింది.

తిరుపతి, విజయవాడ నగరాల్లో పరిసర గ్రామాల విలీన ప్రతిపాదనను కూడా సిఎం చంద్రబాబు నాయుడు శనివారం నిర్వహించిన సమీక్షలో పక్కన పెట్టారు. జనగణన పూర్తయిన తరువాతే నగరాల్లో విలీన గ్రామాల ప్రతిపాదన చేయాలని అధికారులను సిఎం చంద్రబాబు ఆదేశించడం జిల్లా యంత్రాంగంలో కూడా చర్చనీయాంశంగా మారింది. గతంలో 10 పెద్ద గ్రామాలు కలిపితే ఐదు కార్పొరేటర్లు వచ్చారని తమ గ్రామం నుంచి కార్పొరేషన్‌కు వెళితే తమను ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ఆయా గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు రాజకీయంగా కూడా గ్రామ పంచాయతీలు కొనసాగితే ఎన్నో పదవులు వస్తాయని సర్పంచ్‌కే చెక్ పవర్ ఉంటుందని ఆయా గ్రామాల్లో అన్ని రాజకీయ పార్టీల నేతలు అభిప్రాయపడుతున్నారు. అంతేగాక గ్రామాల్లో వార్డు సభ్యులు, సర్పంచ్, ఉప సర్పంచ్, ఎంపిటిసిలు, ఇతర రాజకీయ, అధికార పదవులు ఎన్నో వస్తాయని గుర్తు చేస్తున్నారు. రూరల్ మండలంలోని పలువురు టిడిపి, వైసిపి నాయకులు కూడా తమకు రాజకీయంగా పదవులు పొందే అవకాశం కోల్పోతామని గ్రామాలను కొనసాగించేలా న్యాయపోరాటంచేయాలని యోచిస్తున్నారు.

కుక్కల దాడిలో 32 గొర్రెలు మృతి

ప్రజాశక్తి - అచ్చంపేట

వీధి కుక్కల దాడిలో గొర్రెల గురించి చెందిన సంఘటన అచ్చంపేట మండలం తాడువాయి గ్రామంలో శనివారం రాత్రి చోటు జరిగింది. బాధితుల వివరాల ప్రకారం.. తాడువాయి గ్రామానికి చెందిన కె.వెంకటేశ్వర్లు 60 గొర్రెలను పెంచుతూ ఉపాధి పొందుతున్నాడు. ప్రతిరోజు మాదిరే తన ఇంటి వద్ద ఉన్న గొర్రెల కొట్టంలో ఉంచారు. ఈ క్రమంలో వీధి కుక్కలు వాటిపై దాడి చేయగా 32 గొర్రెలు మృతి చెందాయి. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ పల్నాడు, గుంటూరు జిల్లాల ప్రోగ్రాం కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప, రాజ్యాంగ పరిరక్షణ సమితి పెదకూరపాడు నియోజకవర్గ కన్వీనర్ సందెపోగు అశోక్ ప్రభుత్వాన్ని కోరారు. మృతిచెందిన గొర్రెల విలువ రూ.4 లక్షలుంటుందని వారు చెప్పారు.

కుక్కలు బాబోయ్ కుక్కలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

పట్టణంలో కుక్కల సంచారంతో ప్రజలు బేంబెలెత్తుతున్నారు. ప్రధానంగా 8వ వార్డులో పదుల సంఖ్యలో కుక్కలు సంచరిస్తుండడంతో అటుగా రాకపోకలకు జనం భయపడుతున్నారు. పాఠశాలలు, ట్యూషన్లకు వెళ్లడానికి చిన్నారులు మారం చేస్తున్నారు. ఇప్పటికే పలుచోట్ల కుక్కలు దాడిలో పలువురికి గాయాలయ్యాయి. దీనిపై మున్సిపల్ అధికారుల స్పందన సరిగా లేదనే విమర్శలు వస్తున్నాయి.

విచ్చలవిడిగా కోడి పందేలు

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండలంలోని మంచికలపూడి గ్రామ పరిధిలోని తోపులో విచ్చలవిడిగా కోడిపందాలు జరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు. ఆదివారం పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లినా పోలీసుల రాకను ముందే తెలుసుకుని తప్పించుకుంటున్నారు. ఇటీవల మండల పరిధిలో పేకాటలు నిర్వహిస్తుండగా పెద్దకాకాని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక పోలీసులు కాకుండా ఇతర ప్రాంతాల వారిని పురమాయించి కోడిపందాలు అదుపు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సిఐ వేధిస్తున్నాడంటూ చేయి కోసుకున్న మహిళ

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

సీఐ వేధిస్తున్నారని ఆరోపిస్తూ పోలీస్‌స్టేషన్‌లోనే మహిళ ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన పట్టణంలో శనివారం రాత్రి జరిగింది. బాధిత మహిళ తెలిపిన వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన ధాన్యం వ్యాపారి కోడూరు శ్రీను ధాన్యం వ్యాపారంలో నష్టాలు రావడంతో ఆయనకు డబ్బులిచ్చినవారు స్థానిక సిఐని ఆశ్రయించి డబ్బులు రాబట్టుకునేందుకు ప్రయత్నించాలని కోరారు. ఈ క్రమంలోనే రూ.10 కోట్ల విలువైన ఆస్తులను వారికి రాసివ్వగా ఇంకా మరికొంత డబ్బులు చెల్లించాలంటూ సిఐ వెంకటరావు ఒత్తిడి చేస్తున్నారని, ఈ క్రమంలో శనివారం రాత్రి పోలీసులు ఇంటికి వచ్చారని, ఆ సమయంలో శ్రీను లేకపోవడంతో తనను స్టేషన్‌కు తీసుకెళ్లారని, అక్కడ సిఐ దుర్భాషలాడుతూ బెదిరించారని శ్రీను భార్య జ్యోతి ఆరోపిస్తున్నారు. దీనికి మనస్థాపం చెందిన తాను పోలీస్‌స్టేషన్లోనే చేతిని కోసుకున్నట్లు చెప్పారు. తనను పోలీసులు బెదిరించి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి సెల్‌లో వేయడానికి ప్రయత్నించారని అన్నారు. కొంతమంది పెద్దల కారణంగా సిఐ తరచూ వేధిస్తున్నారని, తనకు ప్రాణం కంటే పరువే ముఖ్యమని, పోలీసుల తీరును సహించలేకే తాను ఆత్మహత్యాయత్నం చేశానని చెప్పారు. జ్యోతిని పోలీసులు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా ఆమెకు చికిత్స అందిస్తున్నారు.

హత్యపై అన్ని కోణాల్లోనూ దర్యాప్తు : ఎస్పీ

ప్రజాశక్తి - చేబ్రోలు

నారాకోడూరు గ్రామ శివారులో శనివారం రాత్రి హత్య జరిగిన నేపథ్యంలో ఘటనా స్థలిని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదివారం పరిశీలించారు. ఘటనకు సంబంధించిన వివరాలపై స్థానిక పోలీసులతో మాట్లాడారు. కేసు దర్యాప్తును వేగవంతం చేసి, నిందితులను త్వరితగతిన పట్టుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసుకు సంబంధించి అన్ని కోణాలలో విచారణ కొనసాగుతోందన్నారు. అనంతరం చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి, శాంతి భద్రతల పరిరక్షణ కొరకు స్థానిక పోలీస్ అధికారులు తీసుకుంటున్న చర్యల పట్ల ఆరా తీశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించొద్దని స్పష్టం చేశారు. రౌడీ షీటర్లకు,

శాంతి భద్రతలకు సమస్యలు కల్పించే వారిని కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. ఎస్పీ వెంట తెనాలి డీఎస్పీ జనార్ధన్, ఎస్‌బి డిఎస్పీ శ్రీనివాసులు, ఎస్‌బి సిఐ ఎ.శ్రీనివాస్, చేబ్రోలు ఎస్‌ఐ వీర నారాయణ ఉన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని పశువుల కాపరి మృతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ద్విచక్ర వాహనం ఢీ కొని పశువుల కాపరి మృతి చెందిన ఘటన మండలంలోని భృగుబండ గ్రామ శివారులో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన చిమట శివ నాగేశ్వరావు (65) పశువులు మేపుకుని సాయంత్రం తిరిగి వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో 88 తాళ్లూరు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వేగం వెళ్తూ శివనాగేశ్వరరావును ఢీకొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్ర వాహనం నడుపుతున్న యువకుడు కూడా తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న రూరల్ సిఐ ఎం.హేమరావు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పశువుల కాపరి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేశారు.

మృతుడు
శివనాగేశ్వరరావు (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో చిన్నారికి గాయాలు

ప్రజాశక్తి - రెంటచింతల

నిదానంపాటి అమ్మవారి దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణంలోచీరాల వెళ్తున్న కారు, ద్విచక్రవాహనం రెంటచింతల హైవేలో ఢీకొన్న సంఘటన ఆదివారం జరిగింది. చీరాలకు చెందిన వాకా రమేష్‌రెడ్డి తన కారులో వెళుతున్నారు. రెంటాలకు చెందిన కె.దుర్గాప్రసాద్ ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఈ రెండు వాహనాలూ ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారులో వున్న వాకా రిషితరెడ్డి అనే చిన్నారికి ఎడమ కాలు దెబ్బతగిలింది. చికిత్స నిమిత్తం గురజాల ఆసుపత్రికి తరలించారు. ద్విచక్రవాహనాన్ని నడుపుతున్న కుక్కమూడి దుర్గాప్రసాద్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

పత్రాలు లేకుంటే వాహనాలు సీజ్ : డీఎస్పీ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

గంజాయి రహిత సమాజమే లక్ష్యంగా జిల్లాను తీర్చిదిద్దాలని ఎస్పి వకుల్ జిందాల్ సంకల్పం కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెనాలి డీఎస్పీ బి.జనార్ధనరావు అన్నారు. తెనాలి డివిజన్ పరిధిలోని పోలీసులతో ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు.చినరావూరు తోటలోని ఇంటింటికి వెళ్లి వాహనాలను తనిఖీ చేశారు. పత్రాలు లేని 43 ద్విచక్ర వాహనాలను, 6 ఆటోలను సీజ్ చేశారు. అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ గంజాయి వినియోగం, రౌడీ షీటర్ల కదలికలను ఎప్పటికప్పుడు జల్లెడ పడుతున్నట్లు చెప్పారు. అసాంఘిక కార్యలాపాల పట్ల పహారా కట్టుదిట్టం చేశామని, శాంతి భద్రతలకు అఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని అన్నారు. కార్యక్రమంలో సిఐలు మల్లికార్జునరావు, రాములా నాయక్, సాంబశివరావు, రూరల్ ఎస్‌హెచ్ఒ ఆనంద్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

గొడవలకెళ్లి జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

ప్రజాశక్తి-ఈపూరు

వివాదాలకు తావు లేకుండా ప్రశాంతంగా జీవించాలని వినుకొండ రూరల్ సీఐ బొప్పన బ్రహ్మయ్య సూచించారు. మండలంలోని బొమ్మరాజుపల్లి తండాలో ఆదివారం చట్టాలపై అవగాహన కల్పించారు. క్రిమినల్, పిల్లల భద్రత, మహిళ చట్టాలను సిఐ వివరించారు. గొడవలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే జరిమానాలు విధిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ కె వేణుగోపాల్ పాల్గొన్నారు.

GENERAL NOTICE

IN THE COURT OF THE PRL. DIST.JUDGE:: GUNTUR

G.W.O.P. No.1230 /2025

Between:

Emmadi Indusri, W/o.NarendraKumar, R/o.Door No.9-130-12, Perumalla vari veedhi, Gorantla, Guntur, Guntur Dt. **....Petitioner**

And

Nil. **...Respondents**

పై నెంబరు ఒ.పి.లోని పిటీషనరు మైనరు బాలికైన మేకపాటి వజ్రసహస్ర యొక్క విద్యాబుద్ధులు, బాగోగులు, పోషణ వగైరాలు కొరకు మైనరు తాలూకు ఆస్తిని అమ్ముటకు పర్మిషన్ కొరుచూ దాఖలుచేయగా సదరు పిటీషనులో ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు వగైరాలు ఉంటే తెలుపుకొన వలసినదిగా కొరుచూ శ్రీ కోర్టు వారు జనరల్‌నోటీసు నిమిత్తం **ది.05-01-2026**కి వాయిదావేసినారు. కావున వాయిదా రోజు **ఉ.గం.10-30ని.**లకు పై కోర్టు వారి యెదుట హాజరై వారికిగల ఆక్షేపణలు, అభ్యంతరములు తెలుపుకొనగలరని యావన్మం దికీ తెలియజేయడమైనది.

Schedule: Guntur Dt., Guntur Sub.Dt., Guntur Muncipal Corporation area, Block No:12., T.S.No:723/2.715/6. Assessment No: 1021046896, Bearing Door No:7, Guntur twon Arundelpet, Kakumanuva Street,Old Ward No:3. New ward No:10.11-22 in an extent of 81.1/2 Sq.yds of vacant site is bounded by.**East:**Kosana Savitramma gari property-26ft,**South:**Somu Venkatra- ran gari property-18ft.,**Again East:** Somu Venkatraran gari property-19 ft.,**Again South:**Road-6ft., **North:** Abburi Venkataramaiah gari site-51ft. **West:**Kosana Savitramma gari property-21ft.Within these boundaries an extent of 81.1/2Sq.yds of vacantsite.

శ్రీమతి యం. చారులత,
పిటీషనరు తరపు అడ్వకేట్, 7/2 అరండల్‌పేట, గుంటూరు

పలు కేసుల్లో నిందితులు అరెస్టు

నిందితుడు, స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

ప్రజాశక్తి - తెనాలి

పలు చోరీ కేసుల్లో నిందితుణ్ణి వన్‌టౌన్ పోలీసులు ఆదివారం అరెస్టు చేసి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్లో సిఐ మల్లికార్జునరావు ఆదివారం వివరాలు వెల్లడించారు.. గుంటూరు కాకాని రోడ్డుకు చెందిన సయ్యద్ ఖాజా వ్యసనాలకు బానిసై దొంగతనాలకు పాల్పడుతున్నాడు. అతనిపై పలు పోలీస్ స్టేషన్లో కేసులు నమోదయ్యాయి. పట్టణంలో ఆటో చోరీకి గురైన నేపథ్యంలో కేసు నమోదు చేసిన ఒన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడ్ని వైకుంఠపురం ఆలయం సమీపంలో ఆదివారం అరెస్టు చేశారు. అతని నుంచి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్, పాత గుంటూరు స్టేషన్లో నమోదైన కేసులకు సంబంధించి రెండు ఆటోలు, 3 టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో మొబైల్ ఫోన్‌ను, పెదకాకాని, తాడేపల్లి పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసులకు సంబంధించి రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

ఆస్పత్రిలో దాడి కేసులో ముగ్గురు...

ప్రజాశక్తి - కొల్లిపర

కొల్లిపర సిహెచ్‌సిలో సెక్యూరిటీ గార్డుపై దాడి చేసి ఆసుపత్రి అద్దాలు పగలగొట్టిన కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు కొల్లిపర ఎస్‌ఐ ఎన్‌సి ప్రసాద్ ఆదివారం తెలిపారు. కొల్లిపంలోని సిహెచ్‌సిలో తోట సూర్యనారాయణ అనే వ్యక్తిని డబ్బులు విషయంలో ఆవులమంద సాయిపవన్ కుమార్, షేక్ షేక్ అబ్దుల్ కరీం, పోకూరి శ్రీనుపై దాడి చేస్తుండగా అక్కడే సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న పాలపర్తి తిరుపతిరావు వారించే ప్రయత్నం చేశాడు. దీంతో వారు తిరుపతిరావును, స్వీపరు రమాదేవిపైనా దాడి చేసి ఆసుపత్రిలో అద్దాలను పగలగొట్టారని తిరుపతిరావు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులను దావులూరు అడ్డరోడ్డు వద్ద అరెస్లు చేశారు.

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ ప్రసాద్

పుస్తకాలే మంచి స్నేహితులు : సిఐ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

పుస్తకాలు జీవితానికి మార్గనిర్దేశం చేస్తాయని ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవరుచుకోవాలని సత్తెనపల్లి పట్టణ సీఐ నాగమల్లేశ్వరరావు సూచించారు. అమరావతి సేవాసమితి ఆధ్వర్యంలో సత్తెనపల్లిలోని వావిలాల స్మృతి వనంలో ఓపెన్ బుక్ రీడింగ్ సెక్షన్ ఆదివారం నిర్వహించారు. ఓపెన్ బుక్ రీడింగ్ కేంద్రాన్ని ప్రారంభించిన సిఐ నాగమల్లేశ్వరావు మాట్లాడుతూ మనిషికి మంచి స్నేహితులు పుస్తకాలే అన్నారు. చెడు మార్గంలో పయనిస్తున్న వారిని.మంచి తోవకు పుస్తకాలు మళ్లిస్తాయి అని తెలిపారు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని చేపట్టిన అమరావతి సేవా సమితి సభ్యులను అభినందించారు. సేవాసమితి అధ్యక్షులు గొల్లపల్లి వీరాంజనేయులు మాట్లాడుతూ సాంకేతిక యుగంలో పుస్తక పఠనం తగ్గిపోవడంవల్ల నైతిక విలువలు, మానవ సంబంధాలు తగ్గిపోతున్నాని అన్నారు. అందరూ పుస్తకాలను చదవడం ద్వారా సమాజంలో మంచి నడవడిని సాధించొచ్చని చెప్పారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు షారోన్ కుమార్, గోపి, ఉత్తేజ్, బాబు, అంకమ్మరావు, మహేంద్ర, సుదర్శన్, సాయి, అశోక్, వైష్ణవ్ పాల్గొన్నారు.

ఎఎం రెడ్డి కాలేజీలో ముగిసిన క్రీడా పోటీలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెంలోని ఎఎంరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న ఎఎంఆర్ ఇగ్నైటెడ్ మైండ్స్ స్పోర్ట్స్ మీట్ 2కె25 క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ఇంజినీరింగ్, డిప్లొమా కళాశాలల నుండి వచ్చిన విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ మల్లికార్జున్ తెలిపారు. వాలీబాల్‌లో సిఆర్.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. 100 మీటర్ల పరుగు పందెంలో ఎన్ఇసి కళాశాలకు చెందిన కె.వెంకటేష్ మొదటి స్థానాన్ని కైవసం చేసుకోగా, చలపతి లాం ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎన్.చంద్రశేఖర్ 2వ స్థానంలో నిలిచాడు. కబడ్డీలో విజ్ఞాన్ లారా ఇంజినీరింగ్ కళాశాల మొదటి స్థానం, ఎఎంరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల 2వ స్థానంలో నిలిచింది. విద్యార్థినుల విభాగంలోని త్రోబాల్ పోటీలో ఎఎంరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, కబడ్డీలో ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాల, వాలీబాల్‌లో యూనివర్సల్ కళాశాలలు విజయం సాధించాయి. డిప్లొమా విద్యార్థుల త్రోబాల్ పోటీలో ఎఎంరెడ్డి కళాశాల, విద్యార్థినుల విభాగంలో ఖోఖో పోటీలో ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాల జట్లు విజయం సాధించగా ఆయా జట్లకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ అట్లూరి శ్రీనివాసరెడ్డి, సెక్రటరీ అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ క్రీడా పోటీలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సమన్వయాన్ని పెంపొందిస్తాయని అన్నారు. కార్యక్రమంలో డిప్లొమా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కృష్ణారెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.భార్గవభూషణరావు, అకడమిక్ డైరెక్టర్ ఎ.పావని, పీడీలు కె.ఈశ్వర్, ఎఎమ్మాన్యువల్, పి.తిరుపతయ్య పాల్గొన్నారు.

తెలుగువారి సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఎడ్ల పందేలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తెలుగువారి సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేలా నరసరావుపేట పట్టణంలో అఖిల భారత స్థాయిలో ఒంగోలు జాతి వృషభరాజముల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును రాష్ట్ర రహదారులు భవనాలు-పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బిసి జనార్దన్ అభినందించారు. పట్టణంలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో జరుగుతున్న ఎడ్ల బల ప్రదర్శన పోటీలను ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, భాష్యం ప్రవీణ్‌తో కలిసి మంత్రి జనార్ధన్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మరుగునపడిపోతున్న సంప్రదాయ క్రీడలైన ఎద్దుల పోటీలు భారీ ఎత్తున నిర్వహించడం సంతోషకర మన్నారు. గెలుపోటములు సహజమని రైతులంతా ఈ పోటీలను క్రీడా స్ఫూర్తితో తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత కాలంలో ఎద్దుల పోషణ, నిర్వహణ ఎన్నో వ్యయప్రయాసలతో కూడుకున్నప్పటికీ రైతులకు గౌరవం, గుర్తింపు లభిస్తుందన్నారు. ఎంపీ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుండి సైతం 200 లకు పైగా ఎడ్ల జతలు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అరుదైన ఒంగోలు జాతిని రక్షించుకునేందుకు ఇటువంటి పోటీలు దోహద పడతాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి పశు సంపదను కాపాడుకునేందుకు అవసరమైన పథకాలు రూపొందించిందన్నారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ రైతులు వ్యవసాయంలో వచ్చిన సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయంతో పాటు పశుపోషణ వంటి ఆదాయ మార్గాల వైపు మొగ్గు చూపాలన్నారు. పల్నాడులో వ్యవసాయం లాభదాయకం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ ఒంగోలు జాతి ఎద్దుల బండలాగుడు పోటీలు ఈ నెల 31వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. రైతులకు, పశు పోషకులు, ప్రేక్షకులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. నాలుగో రోజు పందాలలో విజేతలైన ఎడ్ల జతల యజమానులకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్‌చైర్మన్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, టిడిపి నాయకులు కె.బ్రహ్మయ్య, కె.బాజీ చౌదరి, వి.కిషోర్, కె.విజయ్‌కుమార్, నరసరావుపేట మండల రైతు ప్రధాన కార్యదర్శి ఎం.బ్రహ్మయ్య పాల్గొన్నారు.

యుటిఎఫ్ పల్నాడు జిల్లా నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె.శ్రీనివాసరెడ్డి, మద్దుకూరి మోహనరావు మరోసారి ఏకగ్రీవం

ప్రజాశక్తి-వినుకొండ

కె.శ్రీనివాసరెడ్డి, మద్దుకూరి మోహనరావు

పట్టణంలో ఆదివారం జరిగిన యుటిఎఫ్ పల్నాడు జిల్లా 4వ కౌన్సిల్ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె.శ్రీనివాసరెడ్డి, ఎం.మోహనరావు మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశానికి యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు ముఖ్య అతిథులుగా హాజరుకాగా ఎన్నికల అధికారిగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.పి మనోహర్ కుమార్, పరిశీలకులుగా రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ టిఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు వ్యవహరించారు. గౌరవాధ్యక్షులుగా షేక్ ఖాసింపీరా, సహాధ్యక్షులుగా జె.వాల్యానాయక్, సహాధ్యక్షులుగా ఎ.భాగేశ్వరీదేవి, కోశాధికారిగా ఎం.రవిబాబు ఎన్నికయ్యారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామని, ప్రభుత్వ విద్యా రంగా పరిరక్షణ కోసం పాటుపడి, ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేస్తామని ఎన్నికైన నూతన కమిటీ ప్రతిజ్ఞ చేసింది.

సిఐటియు జాతీయ మహాసభను జయప్రదం చేయాలని ప్రచారం

ప్రజాశక్తి - పెదకూరపాడు : విశాఖలో ఈనెల 31 నుండి వచ్చేనెల 4వ తేదీ వరకూ జరిగే సిఐటియు అఖిలభారత మహాసభను జయప్రదం చేయాలని కన్నెగండ్ల, లగడపాడు గ్రామాల్లో ఆదివారం ప్రచారం చేశారు. 4న విశాఖపట్నంలో జరిగే భారీ కార్మిక ర్యాలీ, బహిరంగ సభకు అన్ని రంగాల కార్మికులు తరలిరావాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.మల్లేశ్వరి కోరారు. కార్యక్రమంలో బి.సూరిబాబు, రాజు పాల్గొన్నారు.

పొలాల్లో నిప్పు.. భూసారానికి ముప్పు..

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పట్టణాలు మొత్తం ఇప్పటికే వాయు కాలుష్యానికి నిలయాలుగా మారాయి. పల్లెలైనా స్వచ్ఛమైన గాలితో ప్రశాంతంగా ఉంటాయనుకుంటే అవికూడా కాలుష్యానికి నెలవుగా మారుతున్నాయి. పొలాల్లోని గడ్డి, ఇతర వ్యర్థాలకు నిప్పు పెట్టి రైతులు చేతులారా భూసారాన్ని దెబ్బతీసుకుంటున్నారు.

పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో 2.85 లక్షల హెక్టార్లలో (హెక్టారుకు 2.5 ఎకరాలు) వివిధ రకాల పంటలు సాగు చేశారు. కొన్ని ప్రాంతాలలో వరి పంటను యంత్రాలతో కోసి దాళ్వా సాగు చేసేందుకు వరి మోడులకు మంట పెట్టి కాల్చి వేయడంతో పొలాల్లో సారం తగ్గడంతోపాటు వాతావరణానికి ముప్పు వాటిల్లుతుంది. గతంలో కోతలయ్యాక, పశువులతో నూర్పులు చేపట్టి, గడ్డిని మేతగా వినియోగించే వారు. కొంతమంది వ్యాపారులు వరి గడ్డిని కొనుగోలు చేసి, ట్రాక్టర్లపై దూర ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయించడం లేదా భూసారం పెంచేందుకు పొలంలో కలియదున్నే పరిస్థితి ఇప్పుడు లేదు. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడం, అన్ని పనులకు పశువుల స్థానంలో యంత్రాలు రావడం, ఎండుగడ్డి కొరతతో మూగ జీవాల పెంపకం తగ్గింది.

వ్యర్థాలకు నిప్పుతో అనేక అనర్థాలు...

వ్యర్థాలను కాల్చడంతో వచ్చే పొగతో గాలి కాలుష్యం పెరుగడం, పొగను పీల్చడం ద్వారా చిన్న పిల్లలు, వృద్ధులు శ్వాసకోశ సమస్యలకు గురవుతారు. ఇప్పటికే శ్వాస కోశ సమస్యలు ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. వ్యర్థాలను తగలబెట్టడంతో భూమికి మేలు చేసే క్రిమి కీటకాలు, మిత్ర పురుగులు, సూక్ష్మ జీవులకు ప్రమాదం

వాటిల్లుతుంది. భూమిలోని ఖనిజాలకు నష్టం కలిగి భూమి సారం తగ్గి పంటల దిగుబడులు తగ్గే అవకాశం ఉంది.

కలియదున్నితే బహుళ ప్రయోజనాలు...

పంట వ్యర్థాలు పొలంలో కలియ దున్నడం వలన సేంద్రియ ఎరువుగా తయారవుతుంది. భూసారం పెరుగి తర్వాత పెట్టే పంటకు నత్రజని, ఇతర ఎరువులు ఎక్కువగా వాడాల్సిన అవసరం తగ్గుతుంది. పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరుగుతాయి.

వ్యర్థాల కాల్చివేతపై అవగాహన కల్పిస్తున్నాం...

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.జగ్గారావు...

పంట నూర్పిడి అనంతరం వ్యర్థాలను పొలంలో కుళ్లబెట్టడం వలన భూసారం పెరుగుతుంది. రైతులకు అవగాహన లేక తగులబెడుతున్న నేపథ్యంలో దీనిపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. వ్యర్థాలకు నిప్పు పెట్టడం వల్ల పంట దిగుబడులు ఆశించిన మేర ఉండవు. పర్యావరణానికి హాని కలుగుతుంది.

4న విశాఖపట్టణానికి తరలి రండి

ప్రజాశక్తి - గుంటూరు

సిఐటియు అఖిలభారత 18వ మహాసభల సందర్భంగా జనవరి 4వ తేదీన విశాఖ నగరంలో జరగనున్న కార్మిక ప్రదర్శన, బహిరంగ సభకు కార్మికులు వేలాదిగా తరలిరావాలని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి దండా లక్ష్మీనారాయణ పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక బ్రాడీపేటలోని సిఐటియు నగర కార్యాలయంలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ డిసెంబర్ 31 నుండి 2026 జనవరి 4 వరకు విశాఖపట్నంలో సిఐటియు అఖిల భారత మహాసభల ప్రతినిధుల సభ జరుగుతాయని, 4న మధ్యాహ్నం 2 గంటలకు విశాఖపట్నం ఆర్.టి.సి కాంప్లెక్స్ అంబేద్కర్ విగ్రహం నుండి ప్రదర్శన, తర్వాత మున్సిపల్ స్టేడియంలో భారీ బహిరంగసభ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు, జిల్లా కోశాధికారి ఎం సాంబశివరావు, జిల్లా కార్యదర్శులు జి.రమణ, బి.ముత్యాలరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

విశాఖపట్నంలో జరుగు సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని ఎంటిఎంసీ పరిధిలోని ప్రాతూరు గ్రామంలో ప్రజా సంఘాల నాయకులు ఆదివారం సాయంత్రం ప్రచారం చేపట్టారు. ఈ ప్రచార కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జన్న శివశంకరరావు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. కార్మికుల పొట్ట కొట్టే విధంగా, పారిశ్రామిక యాజమాన్లకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్లను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని ఆయన విమర్శించారు. ఒకవైపున ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ, ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహిస్తున్న కేంద్ర ప్రభుత్వ కార్మిక విధానాలను కార్మికులందరూ ఐక్యంగా తిప్పి కొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు తాడేపల్లి మండల కన్వీనర్ పల్లె క అష?, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, సిఐటియు తాడేపల్లి మండల నాయకులు కంచర్ల సాంబశివరావు, కెవిపిఎస్ మండల నాయకులు విజయరాజు, డోకిపర్తి కోటయ్య, పీక నాగేశ్వరరావు, నేలటూరి బాబురావు, జ్యోతుల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- తాడేపల్లి

విశాఖపట్నంలో జరగనున్న సిఐటియు అఖిల భారత మహాసభలకు భవన నిర్మాణ కార్మికులు, స్కీము వర్కర్లు, అసంఘటిత కార్మికులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. జనవరి 4వ తారీఖు నాడు చలో విశాఖపట్నంలో పిలుపులో భాగంగా లక్ష లాది మందితో జరిగే భారీ బహిరంగ సభ, ర్యాలీకి తరలిరావాలని సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు కోరారు. ఆదివారం మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మైక్ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, కోట బాబురావు, విజయ్, ఎం దుర్గారావు, మేరీ, రామ్, రామారావు,తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం మంగళగిరి పట్టణంలో నాయకులు ప్రచార జాత కార్యక్రమం జరిగింది. ఈ సందరరేగా అంబేద్కర్ సెంటర్లో జరిగిన ప్రచార జాత కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎస్. చెంగయ్య మాట్లాడారు. కార్మిక వర్గం కొరకు నిరంతరం పోరాడేది సిఐటియు మాత్రమేనని అన్నారు. సిఐటియు జిల్లా నాయకులు వివి జవహర్లాల్ మాట్లాడుతూ సిఐటియు జాతీయ మహాసభలకు మంగళగిరి ప్రాంతం నుండి వేలాదిమంది తరలి వెళుతున్నారని అన్నారు. సిఐటియు సీనియర్ నాయకులు జెవి రాఘవులు మాట్లాడుతూ కేంద్ర, ప్రభుత్వాలు కార్మికులకు జీతాలు పెంచడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం.బాలాజీ, వివిధ ప్రజాసంఘాల నాయకులు షేక్ కాజా, కె.బుజ్జిబాబు, జి.శ్రీనివాస రావు, ఎం.రాంబాబు, ఎస్. వెంకటేష్, వై శివ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు..

పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకుల

ప్రజాశక్తి - తుళ్లూరు

సిఐటియు అఖిల భారత 18 వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ రాజధాని ప్రాంతం తుళ్లూరు, రాయపూడి,వెలగపూడి తదితర గ్రామాల్లో ఆదివారం మైక్ ప్రచారం జరిగింది.ఈ సందర్భంగా సిఐటియు రాజధాని డివిజన్ కన్వీనర్ ఎం.భాగ్యరాజు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం కార్మికులను కట్టు బానిసలుగా చేసే కార్మిక చట్ట సవరణను తీసుకువచ్చిందని మండిపడ్డారు. మహాసభ అనంతరం 4 వ తేదీన విశాఖపట్నంలో వేలాది మందితో బహిరంగ సభ జరుగుతుందని, సభలో కార్మికులు, మేధావులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మదర్ దెరిస్సా ఆటో వర్కర్ యూనియన్ నాయకులు ఎం.లక్ష్మణరావు, హరికృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తుళ్లూరు

డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరగనున్న సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వై నేతాజీ, రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి కోరారు. జనవరి 4న కార్మిక మహా ప్రదర్శన లో కార్మికుల పెద్ద సంఖ్యలో పాల్గనాలని పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం మందడం పారిశుద్ధ్య కార్మికులను ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ, కార్మికులకు అండదండగా నిలుస్తున్న సిఐటియు అఖిలభారత మహాసభలు డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరుగును న్నాయని అన్నారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా కార్మిక ఉద్యమ నాయకులు ప్రపంచ దేశాల నుండి కార్మిక నేతలు ఈ మహాసభల్లో పాల్గొంటారని తెలిపారు. సిఐటియు రాజధాని డివిజన్ కో కన్వీనర్ ఎం రవి మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో సిఐటియు ఎర్రజెండాఅండతో కార్మికులు అనేక సమస్యలను పరిష్కరించుకోగలిగారని అన్నారు. కార్మికుల హక్కుల సాధనకోసం సిఐటియు నిరంతరం పనిచేస్తుందని అన్నారు. సిఐటియు కార్మిక వర్గానికి కొండంత అండగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కుంభ ఆంజనేయులు పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నేతాజీ

ప్రాతూరు, తాడేపల్లి, మంగళగిరిలో సిఐటియు సభలను జయప్రదం చేయాలని ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ఎం.బుక్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - మంగళగిరి

తాడేపల్లి ఎం బుక్ కార్మికులకు నైట్ డ్యూటీ కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసన కార్యక్రమం ఆదివారం నాటికి పదవ రోజు చేరింది. ఫెడరేషన్ ఆధ్వర్యంలో కార్మికులు మంగళగిరి పట్టణంలో గల అంబేద్కర్ విగ్రహానికి తాడేపల్లి ఎం బుక్ కార్మికుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎస్.చెంగయ్య మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల నుండి ఎం బుక్ కార్మికులు నైట్ డ్యూటీ చేస్తున్నారని అన్నారు. వేతనం మాత్రం 10 వేల రూపాయలు మాత్రమే ఇస్తున్నారని అన్నారు. ఇటీవల పగల డ్యూటీ చేయాలని కార్పొరేషన్ అధికారులు చెప్పడంతో కార్మికులు నిరసనకు దిగారు. పగల డ్యూటీ చేస్తే 21 వేల రూపాయలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎం బుక్ కార్మికులను ఆప్కాస్ లోకి చేర్చాలని అన్నారు. ఈ సమస్యను పరిష్కరించకుండా కార్పొరేషన్ అధికారులు, నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్ చూస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వి.వి.జవహర్లాల్, జె.వి.రాఘవులు, సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం.బాలాజీ, మున్సిపల్ యూనియన్ నాయకులు వై శివ నాగేశ్వరరావు, వాసంతి, కనకదుర్గ, కతేర్, వివిధ ప్రజా సంఘాల నాయకులు షేక్ కాజా, ఎస్ వెంకటేష్, కె.బుజ్జిబాబు, జి.శ్రీనివాసరావు, ఎం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పదవ రోజుకు చేరిన ఎం బుక్ కార్మికుల నిరసన

తాడేపల్లి ఎం బుక్ కార్మికులకు నైట్ డ్యూటీ కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ కమిటీ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం ఎదుట జరుగుతున్న నిరసన దీక్ష ఆదివారం నాటికి 10వ రోజు చేరింది. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి సిఐటియు నాయకులు బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎం బుక్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం బుక్ కార్మికులు జయమ్మ, పార్వతి, ఖలీల్, అనిత, కనకదుర్గ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు ఉపాధ్యక్షులు సురేష్

కార్మికులు, కర్షకులు ఐక్యంగా పోరాడి హక్కులను కాపాడుకోవాలి

ప్రజాశక్తి - కొల్లిపర

కార్మిక వర్గమునకు సంఘం పెట్టుకునే హక్కు లేకపోవడం అత్యంత దుర్మార్గమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.వి.కె. సురేష్ అన్నారు శనివారం కొల్లిపర ఆరిమండ వారి కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోర్టులులను సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తుంకిస్తోందన్నారు. పెట్టుబడి దారులకు అనుకూలంగా కార్మికులను బానిసలుగా చేసే విధానం ఈ చట్టంలో ఉందన్నారుఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మొలకా శింబిరెడ్డి మాట్లాడుతూ డిసెంబర్ 31 నుండి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే అఖిలభారత మహాసభల్లో సాలొక్గనాలని కోరారు నాలుగో తేదీ ముగింపు సందరరేగా లక్ష మంది కార్మికులతో ప్రదర్శన జరుగుతుంది కావున ఈ ప్రదర్శనలో కార్మికులు కర్షకులు పాల్గని జయప్రదం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు కోటా చంద్రశేఖర్ ఎం.జయప్రద దేవకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శన చేస్తున్న నాయకులు

అప్పలరాజునాయుడు అరెస్టు దుర్మార్గం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

అనకాపల్లి జిల్లా సిపిఎం పార్టీ నాయకులు అప్పలరాజును అక్రమంగా అరెస్ట్ చేసి పిడి యాక్ట్ పెట్టి జైలుకు పంపించడం దుర్మార్గమని వెంటనే అప్పలరాజు పై పెట్టిన కేసును ఉపసంహరించుకొని పిడి యాక్ట్ ను రద్దు చేయాలని సిపిఎం పార్టీ గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆత్మకూరు, కాజ గ్రామాలలో అప్పలరాజుని అరెస్ట్ చేయడాన్ని నిరశిస్తూ ఆందోళన కార్యక్రమం చేయడం జరిగింది. ఈమని అప్పారావు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో ప్రజల హక్కుల కోసం ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాల నిర్వహిస్తున్న అప్పలరాజు ని కూటమి ప్రభుత్వం అరెస్ట్ చేయడం దుర్మార్గమని ఇది ప్రశ్నించేవారి గొంతు నొక్కివేటమేనని విమర్శించారు. అప్పలరాజు పై పిడిఎఫ్ ఏ విధంగా పెడతారని ప్రశ్నించారు. సంఘ విద్రోహుశక్తులు రౌడీలు గుండాలు గంజాయి మాఫియాలపై పెట్టాల్సిన కేసులను ప్రజా ఉద్యమకారులపై పెట్టటం ఏమిటని ప్రశ్నించారు ఇప్పటికైనా ప్రభుత్వం ఇలాంటి నిరంకుశమైన విధానాలు విడనాడకపోతే ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు కార్పొరేట్లను, పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం ప్రజల హక్కుల కోసం నిరంతరం పనిచేస్తున్న ప్రజా ఉద్యమకారులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఇది సరైనది కాదని తెలిపారు ఇప్పటికైనా ప్రభుత్వం అప్పలరాజు పై పెట్టిన అక్రమ కేసులను అలాగే పిడి యాక్ట్ ను రద్దు చేయాలని ఆయన కోరారు లేనిచో పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి ఉద్యమాలు చేపడతామని తెలిపారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మంగళగిరి మండల కార్యదర్శి వుద్దంటి దుర్గారావు, నాయకులు జి, అజయ్ కుమార్ బి.కోటేశ్వరి, ఎస్.సుమ, చిట్టేల సీతారామాంజనేయులు, బిట్రా రాంబాబు ఆనందం బాబ్జి వి.సురేష్, చిట్టేల గిరిధరరావు,డి.శర్మ, బి.సత్యమారెడ్డి, పాలేటి అప్పారావు తమ్మ ప్రసాద్ రెడ్డి, కారుమూరి గోపాల్ రెడ్డి, ఈదా బ్రహ్మారెడ్డి, గాదే మాధవరెడ్డి బి. పేర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన లక్ష్మణ్

సోషల్ మీడియా సమన్వయకర్తగా వెంకట లక్ష్మణ్

ప్రజాశక్తి - వెల్దుర్తి

బడుగు బలహీన, అణగారిన వర్గాల పక్షపాతి, వెన్నుదన్ను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అని తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా సోషల్ మీడియా సమన్వయకర్త వెంకట లక్ష్మణ్ చెప్పారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి, జిల్లా సోషల్ మీడియా సమన్వయకర్త పదవీ బాధ్యతలకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. యువ నాయకులు జూలకంటి గౌతమ్ రెడ్డి, అక్కిరెడ్డి జూలకంటి, పంగులూరి పుల్లయ్యలకు, ఎమ్మెల్యే వ్యక్తిగత సోషల్ మీడియా టీం సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - యడ్లపాడు

కామ్రేడ్ పోపూరి రామారావు విజ్ఞాన కేంద్రంలో బాసట ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెడికల్ క్యాంపునకు స్పందన లభించింది. షుగరు బిపి ఫిట్స్ పక్షవాతం సంబంధించిన పేషెంట్స్‌కు డాక్టర్ల పర్యవేక్షణలో రెండు నెలలకు సరిపడా మందులను అందజేశారు. ఈ క్యాంపు డాక్టర్లుగా డాక్టర్ గుంటుపల్లి భవ్య తేజ, డాక్టర్ జి.దివ్య తేజ,డాక్టర్ ఎడ్ల రన్విత,డాక్టర్ ఏ మౌనిక చౌదరి మరియు డాక్టర్ సొంటినేని నవ్య శ్రీ, ఎస్ శ్రావ్య పేషెంట్లకు సూచనలు సలహాలు ఇచ్చారు. క్యాంపు నిర్వాహకులు బాసట అధ్యక్షులు కాళిదాసు, ట్రెజరర్ కేత రామ బ్రహ్మం, సభ్యులు ముత్తవరపు రవీంద్రబాబు , రావూరి సుమన్, పోపూరి శ్రీనివాసరావు, ముత్తవరపు వేణు,, గోనుగుంట్ల కిరణ్ , రావూరి సురేష్ , కోయ రామోజీ, చిట్టిపోతు రంగారావు, ముత్తవరపు ధర్మ, నారాయణ హైస్కూల్, విద్యార్థినులు వాలంటీర్లుగా వ్యవహరించారు.

మద్యం దుకాణాల్లో తనిఖీ

ప్రజాశక్తి-ఈపూరు

స్టాక్ పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు

స్థానిక ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉన్న రొంపిచర్ల మండలంలోని నీలకంఠేశ్వర వైన్స్, విప్పర్ల రెడ్డిపాలెంలోని తిరుమల వైన్స్‌లను ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు ఎక్సైజ్ సీఐ డి.వెంకటేశ్వర్లు తెలిపారు. దుకాణాలలో మద్యం నిల్వలను పరిశీలించి టీ.పీలతో సరిపోల్చడం జరిగిందన్నారు. ముందుగా డెకాయ్ ఆపరేషన్ చేపట్టి మద్యం దుకాణాలలో విక్రయిస్తున్న మద్యం ధరలు నిర్ధారించినట్లు సీఐ తెలిపారు. నాటు సారాయి, మాదకద్రవ్యాలు,నకిలీ మద్యం, కల్తీ మద్యం, గంజాయి, కల్తీకల్లు వాటిపై సమాచారం ఉంటే స్థానిక పోలీసులకు తెలియజేయాలని ఆయన కోరారు. బహిరంగ ప్రదేశాలలో మద్యపానం చేయటం చట్టరీత్యా నేరమని అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

బ్యానర్ల తొలగింపు అన్యాయం : బొల్లా

ప్రజాశక్తి - వినుకొండ

గత సంస్కృతి సంప్రదాయాలను పక్కన పెడుతూ నూతన సంవత్సరం సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ తమ పార్టీ నాయకులు కట్టిన బ్యానర్లు ఏకపక్షంగా తొలగించడం అన్యాయమని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మండిపడ్డారు. స్థానిక మున్సిపల్ కమిషనర్ ఒత్తిడికి ఏవేవో షాపులు చెబుతూ బ్యానర్ తీయడం సరికాదు అన్నారు. వాస్తవాలను చెప్పాలని డిమాండ్ చేశారు. పెద్దకంచర్ల లో పైన చెరువు పెట్టుకొని ట్యాంకులతో నీళ్ల అందించే దారుణమైన పరిస్థితి తీసుకొచ్చింది మీరే కదా అని ప్రశ్నించారు. ఇటీవల వినుకొండ నియోజకవర్గంలో శాంతిభద్రతలు పూర్తిగా ఎక్కడ చూసినా దొంగతనాలు హత్యలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు.

నరసరావుపేట నిత్య దుర్గంధం

పారిశుధ్య నిర్వహణ లోపంతో పట్టణ ప్రజలు అవస్థలు

రామిరెడ్డిపేటలో పేరుకుపోయిన చెత్త

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణంలో ఎక్కడికక్కడ చెత్త పేరుపోయి కొపుకొడుతోంది. పల్నాడు రోడ్డులో వెళ్లాలంటే ప్రజలు ముక్కు మూసుకుని వెళుతున్నారు. చెత్త కుప్పలు పేరుకుపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో మున్సిపల్ అధికారుల తీరు పట్ల ఆయా వ్యాపార సముదాయాల యజమానులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెత్త కుప్పలు సకాలంలో తొలగించక పోవడంతో పశువులు, వీధి కుక్కలు చెత్త కుప్పలను చెలిగడంతో దుర్వాసన వెదజల్లుతుంది. ఒక వైపు సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే పారిశుద్ధ్య లోపంతో పరిస్థితితులు ఆందోళన కలిగిస్తున్నాయని వాపోతున్నారు. మురుగు నీరు సక్రమంగా పారుదల కాక రోడ్డు పైకి రావడంతో దుకాణంలోకి వచ్చే ప్రజలు మురుగు నీటిలో నుండి వస్తున్నారని ఆయా దుకాణ దారులు వాపోతున్నారు. పట్టణంలో పలు ప్రాంతాలలో కాలువల నిర్మాణం లేక మురుగు నీరు రోడ్లపై నిలిచి దుర్గంధం వెదజల్లుతోందని దీంతో వ్యాధులబారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్న నేపథ్యంలో దోమలు ఉత్పత్తి చెంది జ్వరాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో తనిఖీ

గోడౌను తనిఖీ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని ముప్పాళ్ళ,ఇనిమెళ్ళ, సొసైటీల ఎరువులు పురుగుమందుల దుకాణాలను ఏవో ఆర్ రామారావు ఆదివారం తనిఖీ చేశారు. బిల్ బుక్స్ స్టాక్ రిజిస్టర్లతో పాటు గోదాములలోని ఎరువుల నిల్వలను సరిచూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులను ఎమ్మార్పీ ధర కంటే అధికంగా అమ్మిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. రైతులు అధిక మోతాదులో యూరియాను వాడకూడదని సూచించారు.

సంక్షేమ పథకాలు అమలు చేయని కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం కోసం పాత సంక్షేమ పథకా లన్నీ పునరుద్ధరిస్తామని చెప్పి నేటికీ 19 నెలలు గడుస్తున్నా ఇంకా అమలు చేయడం లేదని గిరిజన సమా ఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.శ్రీనునాయక్ అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రధానంగా క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ కానుక, సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా లాంటివి అందజేస్తామని తెలిపారని నేటికి దానిమీద మాట్లాడకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. దానిలో ఏ ఒక్కటి అమలు చేయలేదని, ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర దాటుతున్న ఏ ఒక్క కానుక ఇవ్వలేదని మండిపడ్డారు. చ్చిన హామీలను అమలు చేయకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నా,నిరసన లాంటి కార్యక్రమాలు చేస్తామని కూటమి నేతలను హెచ్చరించారు.

ప్రజారోగ్య రక్షణకు మరిన్ని సేవలందించాలి : ఎమ్మెల్యే పుల్లారావు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ప్రజారోగ్య పరిరక్షణకోసం చంద్రబాబు నాయకత్వం లోని కూటమిప్రభుత్వం చేస్తున్న విశేష కఅషిని, పేదలకు అందిస్తున్న వైద్యసేవల్ని మరింత విస్తఅతం చేయడంలో టీడీపీ వైద్య విభాగం కీలక పాత్ర పోషించాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. ఆదివారం ఆయన పట్టణంలోని తూర్పు మాలపల్లెలోని చంద్రమౌళి పార్క్ నందు టీడీపీ డాక్టర్స్ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ప్రసంగిస్తు కంటి సంబంధిత సమస్యలతో పాటు.. గుండె, కేన్సర్ వ్యాధిగ్రస్తులకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేయడానికి ముందుకొచ్చిన వైద్యుల్ని, ఆసుపత్రుల యాజమాన్యాల్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షు లు పఠాన్ సమాధ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు,టీడీపీ నాయ కులు పిల్లి లెనిన్ , గెరా రాము, వైద్యుల విభాగం ప్రతినిధులు గల్లా మురళీకృష్ణ, కొండిబోయిన శ్రీనివాస్ రావు, సాతులూరి రాజేశ్వరి, ఖలీఫా, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

యార్డు చైర్మన్‌ను కలిసిన పెదకూరపాడు టిడిపి నాయకులు

ప్రజాశక్తి - పెదకూరపాడు

గుంటూరు మిర్చి మార్కెట్ చైర్మన్‌గా నియమితులైన కుర్రా అప్పారావును పెదకూరపాడు మండల తెలుగు దేశం పార్టీ నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య నాయకత్వంలో అప్పారావు ను కలిసి అభినందనలు తెలిపారు. తెలియజేసిన వారిలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు అత్తిమళ్ళ రమేష్, రాష్ట్ర ఎంఎస్ఎమ్ఈ డైరెక్టర్ గుడిపూడి చిన్న రాజు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, హాస్పిటల్ కమిటీ డైరెక్టర్ అంద్ర ప్రసాద్, జిల్లా టిడిపి ఉపాధ్యక్షురాలు షేక్ ముంతాజ్ మాజీ మండల అధ్యక్షులు బెల్లంకొండ రాంగోపాల్రావు గల్లా బాబురావు సీనియర్ నాయకులు మద్దినేని సత్యనారాయణ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మక్కెన సాగర్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు టెండర్లు రాకపోవడం ప్రజా విజయం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్రంలో మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణ ప్రభావంతో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు కూటమి ప్రభుత్వం పిలిచిన టెండర్లకు ఒక్కరూ కూడా టెండర్ దాఖలకు రాకపోవడం ప్రజా విజయమని ఇది రానున్న ఎన్నికలలో వైసిపి విజయానికి నిదర్శనమని, వైసిపి పల్నాడు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి అన్నారు. గుడ్ మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమంలో భాగంగా ఆదివారం వైసిపి పల్నాడు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి పట్టణం లోని ఇస్లాంపేట, వెంగళరెడ్డి నగర్ ప్రాంతాల్లో పర్యటించి అక్కడి ప్రజలను అక్కడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

సిఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

ప్రజాశక్తి - వెల్దుర్తి

ముఖ్యమంత్రి చంద్రబాబు నేత అత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి అధిక ప్రధాన్యత ఇస్తోందని మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి వెల్లడించారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో రూ. 28 లక్షల, 70 వేలు విలువ చేసే చెక్కులను 31 మంది లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.., ఆపత్కాలంలో ఆసరాగా నిలుస్తూ ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం బాసటగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చీరలు పంపిణీ చేస్తున్న పాస్టర్లు

పేదలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణ శివారులో ఉన్న లెప్రసీ కాలనీలో పేదలకు పాస్టర్ల ఆధ్వర్యంలో ఆదివారం చీరలు, పండ్లు పంపిణీ చేశారు. పాస్టర్లు పీటర్ పాల్, శంకర్, సువర్ణ సుందరి, అభిషేక్ కలిసి నూతన సంవత్సరం సందర్భంగా వీటిని సమకూర్చారు. వీరు నిజంగా పనేమీ చేసుకోలేని నిరాశ్రయులని, వీరికి అందరూ సహకరించి సహాయపడాలని కోరారు. కార్యక్రమంలో ప్రసాద్, మల్లేష్, ప్రేమ్, ఉదయ్, విజయ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

శుభ్రపరుస్తున్న సేవా సమితి సభ్యులు

ఎక్కడైనా అపరిశుభ్రంగా ఉంటే చెప్పండి

ప్రజాశక్తి - మాచర్ల

శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛంధ్రా కార్యక్రమంలో భాగంగా సాగర్ రోడ్ క్వారీ సమీపంలోని అంగన్వాడి ఆఫీస్ చుట్టూ ఉన్నటువంటి పిచ్చి చెట్లు, కంప చెట్లు తొలగించి, అంతా శుభ్రం చేశారు. సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ గ్రీన్ మాచర్ల, స్వచ్ఛ మాచర్ల సంకల్పంతో ప్రతి ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, మాచర్ల పట్టణంలో ఎక్కడ అపరిశుభ్రంగా ఉంటుందో అక్కడ శ్రీరామకఅష్ణ సేవాసమి సభ్యులు ఉంటారని గోవిందరెడ్డి అన్నారు. పట్టణంలో అపరిశుభ్రంగా ఉంటే తమకు తెలపాలని, తమతో భాగస్వాములు కావాలనుకున్నవారు సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సిహెచ్ రుక్మిణి, సుందరమ్మ, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మానవతా, రెడ్ క్రాస్ సొసైటీ వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మగ్గం వర్క్ శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ- మానవతా చైర్మన్ ఎం.రామ శేషగిరి రావు, రెడ్ క్రాస్ సెక్రటరీ శ్రీనివాస్, డాక్టర్ రాంప్రసాద్, మానవతా స్వచ్ఛంద సంస్థ ప్రెసిడెంట్ మాకినేని హరిబాబు, సెక్రటరీ కందం నాగ జ్యోతి హాజరై, మగ్గం వర్క్ శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్ అందజేశారు. డాక్టర్ నంద్యాల రామ్ ప్రసాద్ రెడ్డి, కోయ రామారావు, పోకా శ్రీనివాసు, కన్నెగంటి శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సీకే హైస్కూల్‌లో పరిమళించిన స్నేహ సౌరభం

ప్రజాశక్తి - మంగళగిరి

పాతికేళ్ల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థులంతా ఒక్కచోట చేరారు. మళ్లీ బాల్యంలోకి వెళ్లి గత స్మృతులను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఇన్ని సంవత్సరాల తర్వాత కలుసుకుని ఘనంగా సన్మానించుకున్నారు. మంగళగిరి పట్టణంలోని చింతక్రింది కనకయ్య బాలుర ఉన్నత పాఠశాలలో 1999-2000 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. సీకే జూనియర్ కళాశాల పాలక మండలి అధ్యక్షులు చింతక్రింది కనకయ్య, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ గంజి చిరంజీవి, ప్రిన్సిపాల్ అత్తోట రత్నబాబు, తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు దామర్ల కనకలింగేశ్వరరావు, ఆర్.సైదులు, గద్దె నరసింహారావు, జొన్నాదుల దేవేంద్రరావు, ఎం.రాజేంద్రన, జంజనం పాండురంగారావు, గుణేశ్వరరావు, పంచల సాంబశివరావు, శనగల రామహనుమాన, తుమ్మా నాగేశ్వరరావు, జొన్నాదుల వెంకటేశ్వరరావు, ఎం.చలపతిరావు, దాసరి సాంబశివరావు, వై.రాజశేఖర్, సుబ్బారావు, నాన టీచింగ్ స్టాఫ్ చిరంజీవి, నాగేశ్వరరావులను ఘనంగా సన్మానించి పూలమొక్కలు, జ్ఞాపికలను అందజేశారు.

డైరీ ఆవిష్కరిస్తున్న నాయకులు

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- తాడేపల్లి

రాష్ట్ర ఇరిగేషన్ ఆర్ & బి, పి.ఆర్, ఆర్. డబ్ల్యూ. ఎస్., డిపార్ట్‌మెంట్స్ మెయింటినెన్స్ & ప్రాజెక్ట్ ఎస్టాబ్లిష్మెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (సిఐటియు)కు సంబంధించి 2026 డైరీ, మరియు క్యాలెండర్ ను ఆదివారం తాడేపల్లిలో ఆవిష్కరించారు. యూనియన్ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం స్థానిక మేక అమరారెడ్డి భవన్లో నిర్వహించారు. సమావేశానికి యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్.కె. రెహాన్ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులందరికీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ మొత్తం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఆర్.వి.రాఘవయ్య, ఎం.రామ్మోహన్రావు, సీనియర్ నాయకులు వి.గణేష్, పి.సత్యనారాయణ, తాడేపల్లి మండల పట్టణ సిఐటియు నాయకులు పల్లె కృష్ణ, వేముల దుర్గారావు, వివిధ జిల్లాల నుండి వచ్చిన అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి - మంగళగిరి

దేశ స్వాతంత్ర ఉద్యమంలో ఆనాటి మహనీయులు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలు చేసిన త్యాగాలను క అషిని ఎన్నటికీ మరువలేనివని మంగళగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ షేక్ సలీం అన్నారు. మంగళగిరి బైపాస్ రోడ్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా కాపు సాధికారలక చైర్మన్ రేమిని శెట్టి హనుమంతరావు, గుంటూరు మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు షేక్ మున్ని, గుంటూరు జిల్లా మున్సిపల్ వైస్ ప్రెసిడెంట్ బుల్ల సర్వేశ్వర కుమార్, మంగళగిరి మండలం అధ్యక్షులు కుప్పాకుల కృష్ణ చౌదరి, తాడేపల్లి మండల రూరల్ అధ్యక్షులు సుభాని, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు ధర్మపురి సామేలు పాల్గొన్నారు.

వడ్డేశ్వరంలో..

తాడేపల్లి రూరల్ : వడ్డేశ్వరంలో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నిరంతరం పేదల పక్షాన పోరాటం చేస్తుందని అన్నారు. భారత దేశ స్వతంత్ర ఉద్యమంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందన్నారు. రాష్ట్ర చేనేత కార్మిక సంఘం చైర్మన్ రామనాదం పూర్ణ చంద్రరరావు, జిల్లా కాపు సాధికార చైర్మన్ రేమిడి, శెట్టి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల హక్కుల సాధనకు ఉద్యమిద్దాం

ప్రజాశక్తి - గుంటూరు

మైదానప్రాంత గిరిజనుల హక్కుల సాధనకు ఉద్యమించాలని, గిరిజనులకు అసెంబ్లీలో ప్రాతినిధ్యం కల్పించాలని గిరిజన ప్రజాసమాఖ్య జాతీయ అధ్యక్షుడు, ఎస్టీ కమిషన్ రాష్ట్ర మాజీ సభ్యులు వడిత్యా శంకర్‌నాయక్ అన్నారు. గుంటూరు అంబేద్కర్ భవన్‌లో ఆదివారం గిరిజన ప్రజాసమాఖ్య, విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన గిరిజన ప్రజాచైతన్య యాత్ర రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. శంకర్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మైదాన ప్రాంత గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించి, గిరిజన హక్కుల పరిరక్షణకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని అన్నారు. నేటికీ రాష్ట్రంలోని లక్షలాదిమంది గిరిజనులకు కనీసం కూడు, గూడు, నీడ కోసం ఎదురు చూస్తున్నారని, రేషన్‌కార్డు, ఆధార్ కార్డు

సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

లేక దుర్భరంగా జీవిస్తున్నారని చెప్పారు. ఏ ప్రభుత్వం వచ్చినా ఎస్టీ జాబితాలోకి ఇతర కులాలను చేర్చే ప్రతిపాదనను తీసుకోరావటం చాలా బాధాకరమన్నారు. ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేరిస్తే ఒప్పుకునేది లేదన్నారు. సమావేశంలో గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, కార్యదర్శి కె.రవి నాయక్, ఆర్.కఅష్ణనాయక్, డి.చంద్రనాయక్, మోహన్ కుమార్ ధర్మ, కేసీ పెంచులయ్య పాల్గొన్నారు.

ప్రేక్షకుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానటి సావిత్రి

నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు, గుమ్మడి గోపాలకృష్ణయ్య

ప్రజాశక్తి- తాడేపల్లి

తెలుగు సినిమా అగ్ర నటి, దర్శకురాలు, అభిమానుల చేత మహానటిగా గొప్ప కీర్తిని పొందిన సావిత్రి వర్ధంతి సందర్భంగా తాడేపల్లి బైపాస్ రోడ్డులోని నారా లోకేష్ క్రీడా ప్రాంగణంలో సావిత్రి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సభకు నల్లిబోయిన శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అధితిగా పాల్గొన్న రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ అలనాటి అందాల సినీ తార సావిత్రిని తెలుగు వారితో పాటు తమిళనాడు ప్రజలు, కళాభిమానులు ఎంతో ప్రేమతో, గౌరవంతో ఆదరించారని అన్నారు. ఎన్టీఆర్ సావిత్రి హిట్ పెయిర్‌గా పేరు పొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, అరవపల్లి శ్రీనివాసరావు, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు టంకశాల ఈశ్వర్ నాయుడు, కోగంటి ప్రసాద్, కోగంటి వెంకటేశ్వరావు, పుల్లెపు భాస్కరరావు, కాసార గడ్డ శ్రీనివాసరావు, ఇట్టా భాస్కర్, తోట సాంబశివరావు, మండవ గోపాలరావు, అడపా నరేష్, నక్కా నవీన్ రాజా, అనిల్, కుటుంబ సభ్యులు దావులూరి అనిల్, చంద్ర శేఖర్, తాడేపల్లి మహిళ మండల అధ్యక్షులు బొర్రా కృష్ణవందన, పట్టణ మహిళ అధ్యక్షురాలు అన్నెం కుసుమ పాల్గొన్నారు.

కొండపాటూరు ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - పెదనందిపాడు

మండలంలోని కొండపాటూరు శ్రీ పోలేరమ్మ అమ్మవారి దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం శనివారం రాత్రి నిర్వహించారు.ముఖ్యఅతిథిగా ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు హాజరయ్యారు. 11 మందితో ధర్మకర్తల మండలి ఏర్పాటు జరిగినట్లు ఆలయ ఈవో జక్కా శ్రీనివాసరావు తెలిపారు. నూతన చైర్మన్‌గా పొన్నం వీరయ్య చౌదరి ఎంపికయ్యారు. నూతనంగా ఎంపికైన ధర్మకర్తల మండలిని ఎమ్మెల్యే రామాంజనేయులు అభినందించి, సన్మానించారు. గ్రామంలో ఎస్సీ, ముస్లింల స్మశాన వాటిక సమస్య, కాకుమాను వైపు రోడ్డు దెబ్బ తిన్నదని తదితర సమస్యలు

ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామాంజనేయులు

గ్రామ పెద్దలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. త్వరలోనే వాటిని పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రమాణ స్వీకార మహోత్సవానికి ధర్మకర్తల మండలి సభ్యులు, గ్రామ ప్రజలు, టిడిపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కాటూరి శిల్పశాలలో కొలువైన చత్రపతి శివాజి భారీ కళాఖండం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఇనుప వ్యర్థాలతో రూపొందిస్తున్న విగ్రహాలను కేవలం శిల్పాలుగా కాకుండా సామాజిక సందేశాన్ని, అందించే గొప్ప కళాఖండాలుగా చూడాలని కాటూరి ఆర్ట్ గ్యాలరీ వ్యవస్థాపకులు, కళారత్న కాటూరి వేంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ఆటోనగర్ కాటూరి ఆర్ట్ గ్యాలరీలో ఆదివారం ఏర్పాటుచేసిన విగ్రహావిష్కరణ కార్యక్ర మంలో ముఖ్య అతిథి కాటూరి కొండమ్మతో కలసి ఆయన శివాజీ కళాఖండాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వృత్తిలో

విగ్రహంతో కాటూరి కుటుంబ సభ్యులు

ఏకాగ్రత, నైపుణ్యం కలిగిన కళాకారులు చేతుల్లో రూపొందించిన ఎటువంటి కళాఖండమైనా జీవ కళ ఉట్టిపడేలా ఉంటాయన్నారు. అటువంటి శిల్పులతో రూపొందించిన చత్రపతి శివాజీ భారీ కళాఖండం కాటూరి ఆర్ట్ గ్యాలరీకే వన్నెతెచ్చిందన్నారు. ఈ సందర్భంగా తమ శిల్పాలలో పనిచేస్తున్న సుమారు 70 మంది కార్మికులను ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ సన్మానించారు. కార్యక్రమంలో ఫైన్ ఆర్ట్స్ యువ శిల్పి కాటూరి శ్రీహర్ష, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రజలతో ప్రతిజ్ఞ

ప్రజాశక్తి - పెదకాకాని

ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఐలు

మండల కేంద్రమైన పెదకాకానిలోని వై జంక్షన్ వద్ద ఆదివారం మాదక ద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా అమలు చేస్తున్న సంకల్పం, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం కార్యక్రమంలో భాగంగా ఎస్ఐలు రామకృష్ణ, మీరజ్ పెదకాకాని వై జంక్షన్ వద్ద ప్రజలతో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల వినియోగంతో కుటుంబము మరియు సమాజంలో వచ్చే ఇబ్బందులను వారికి తెలియజేశారు.అనంతరం మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కానిస్టేబుల్ యువత పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న కార్మికులు

390వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

చట్టపరంగా తమకు రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 390 రోజుకు చేరుకున్నాయి. దీక్షలను నాయకుడు కె.స్టీవెన్, టి.నాగేశ్వరావు, వై.సాంబశివరావు, షేక్ సుభాని, బి.అంకయ్య ప్రారంభించారు. దీక్షల్లో దామవరపు నాగేశ్వరావు, జి.కొండా, బొందలపాటి నవనీతమ్మ, వేముల లక్ష్మమ్మా, మొలక శారదమ్మ కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో మల్లె గురవయ్య, దర్శి మాణిక్యా రావు, సూర్యప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకుడు కూరపాటి స్టీవెన్ మాట్లాడుతూ విశాఖపట్నంలో జరుగుతున్న సీఐటీయూ కార్మిక మహాసభలకు కార్మికు లందరినీ ఆహ్వానిం చారని, వీలున్నవారు సభలకు రావాలని పిలుపునిచ్చారు.

కవి ఆళ్లకు సాహిత్య కవి బిరుదు

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన కవి, రచయిత ఆళ్ళ నాగేశ్వరరావు 'సాహిత్య కవి' బిరుదును అందుకున్నారు. సాహితి కెరటాలు శీర్షికతో ప్రతివారం నిర్వహించే కవితల పోటీలకు రచనలు చేస్తూ అర్థ శతకం పూర్తి చేసుకున్న సందరేగా 'సాహిత్య కవి' బిరుదును ప్రధానం చేస్తున్నట్లు సాహితీ కవి కళా పీఠం అధ్యక్ష కార్యదర్శులు భరద్వాజ రేవణి, సూర్య భాస్కరాచార్యులు వెల్లడించారని ఆళ్ల తెలిపారు.

బుర్రిపాలెంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన డి3 శారద సర్వీసెస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతినెల చివరి ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని రూరల్ గ్రామం బుర్రిపాలెం ఎస్ భవన్ లో నిర్వహించారు. ముఖ్యంగా షుగర్ వ్యాధిగ్రస్తులకు పరగడుపున రక్త పరీక్షలు నిర్వహించి, అల్పాహారం అందించిన తదుపరి మరోసారి రక్త పరీక్షలు నిర్వహించి, వారితో శారీరిక వ్యాయామం చేయించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. షుగర్ వ్యాధి పై ప్రజలలో అవగాహన పెంపొందించి మందుల వినియోగాన్ని తగ్గించే విధంగా కృషి చేస్తున్నట్లు డాక్టర్ శారద వెల్లడించారు. కార్యక్రమంలో వాలంటీర్లు, కన్వీనర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - తెనాలి

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిసెంబర్ నెల సమావేశాన్ని ఆదివారం కవిరాజా పార్కులోని విజికే భవన్లో నిర్వహించారు. సమావేశంలో 2024- 25 సంవత్సరానికి సంబంధించి అసోసియేషన్ జమా ఖర్చులు సభ్యులకు వివరించారు. అనంతరం 2026-27 నూతన కార్యవర్గ ఎన్నికలను ఎన్నికల అధికారి నయాబ్ రసూల్ నిర్వహించారు. అధ్యక్ష కార్యదర్శులుగా మొవ్వ సత్యనారాయణ, ప్రసాదం పూర్ణచంద్రరావు, ఉపాధ్యక్షులుగా కె.ఈశ్వర్ చంద్, జాయింట్ సెక్రటరీగా పి.కోటిరెడ్డి, కోశాధికారిగా ఎస్.ఆదినారాయణ, కార్యవర్గ సభ్యులుగా ఎస్.రామకృష్ణ, వి.సత్యనారాయణ, టి.రత్తయ్య, వి.నారాయణ శివప్రసాద్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

గీతా మందిరం చైర్మన్‌గా వెలుగూరి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు గీతా మందిరం ఛైర్మన్‌గా వెలుగూరి అభయశ్రీ రత్నప్రసాద్ మళ్ళీ నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ నియామక పత్రాన్ని అందుకున్నారు. గతంలో ఆయన చైర్మన్‌గా సుదీర్ఘకాలం పాటు పనిచేశారు. ఈ సందర్భంగా పలువురు ఆర్యవైశ్య ప్రముఖులతో పాటు ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అభినందనలు తెలిపారు.

విజేతలకు బహుమతులు అంజేస్తున్న ప్రిన్సిపాల్

చిప్స్‌లో ముగిసిన బేస్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి - గుంటూరు

చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కాలేజిలో రెండ్రోజులపాటు నిర్వహించిన ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ అంతర కళాశాల బేస్‌బాల్ మెన్స్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. వర్సిటీ పరిధిలో పది కాలేజిలు పాల్గన్నాయి.ప్రధమ స్థానంలో ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి, ద్వితీయ స్థానంలో ఏఎన్‌యు ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజి, తృతీయ స్థానంలో వాగ్దేవి డిగ్రీ కాలేజి, నర్సరావుపేట, నాల్గవ స్థానంలో సిఆర్ కాలేజి నిలిచాయని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధర తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులతో యూనివర్సిటీ టీమ్‌ను ఎంపిక చేశారు. జనవరి 2న పూనేలోని సావిత్రిభాయి పూలే యూనివర్సిటీలో జరిగే ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో ఈ బృందం పాలశ్రీచిప్స్ కాలేజి ఫిజికల్ డైరెక్టర్ ఏడుకొండలు ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. ఈ టోర్నమెంట్‌కు అబ్జర్వర్‌గా యూనివర్సిటీ యోగా కోఆర్డినేటర్ డాక్టర్ సూర్యనారాయణరావు, ఎంపిక కమిటీ సభ్యులుగా డాక్టర్ పాతూరి శ్రీనివాస్, డాక్టర్ బుచ్చిబాబు, డాక్టర్ మెర్సిన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - గుంటూరు

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 104 ఎంఎంయూ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నాయకులు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఆదివారం గుంటూరులోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందచేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు గోరంట్ల సురేష్‌కుమార్ మాట్లాడుతూ 104 గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందిస్తు ప్రజా సంజీవనిగా పేరుతెచ్చుకుందని, కానీ వాటిలో పనిచేస్తున్న సిబ్బంది మాత్రం సమస్యల వలలో చిక్కుకొని ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. గత సర్వీసు ప్రొవైడర్ అయిన అరబిందో నుండి రావాల్సిన బకాయిలు గ్రాట్యుటీ, ఎర్న్‌లీవ్‌లు తక్షణమే చెల్లించాలని కోరారు. అలాగే ప్రస్తుత భవ్య యాజమాన్యం కూడా ఇప్పటివరకు నియామక పత్రాలు కానీ, పేస్లిప్‌లు ఇవ్వలేదన్నారు. యాజమాన్య వేధింపులు ఆపాలని కోరారు. ఎటువంటి అనుభవం లేని డేటా ఎంట్రీ ఆపరేటర్‌కి మందుల నిర్వహణ బాధ్యతలు తొలగించాలని కోరారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాట్ల రాంబాబుకు ఇచ్చిన షోకాజ్ వెనక్కి తీసుకోవాలని కోరారు. డేటా ఎంట్రీ ఆపరేటర్‌కి రూ.18500లకు జీతం పెంచాలని, 5 సంవత్సరాల సర్వీస్ పూర్తి అయిన డ్రైవర్‌లకు ఆటోమెటిక్‌గా స్లాబ్ అమలు చేయాలని, ప్రతి డివిజన్‌కి ఒక బఫర్ సిబ్బందిని నియమించాలని కోరారు.కార్మిక చట్ట ప్రకారం క్యాజువల్ లీవ్‌లు ఇవ్వాలని కోరారు. ఈ విషయాలపై చర్చించి తగు న్యాయం చేస్తామని పెమ్మసాని చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీహర్ష నాయకులు హరి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మనమిత్ర యాప్ ద్వారా పోలీస్ సేవలు : ఎస్‌పి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన మరియు సులభమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన "మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్" కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు జిల్లా ఎస్‌పి వకుల్ జిందల్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు తమ మొబైల్ ఫోన్‌లో వాట్స్ ఆప్ ద్వారా నేరుగా పోలీస్ సేవలను పొందే అవకాశం కల్పించినట్టు తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటి నుంచే అనేక సేవలు అందుబాటులోకి వచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఎఫ్.ఐ.ఆర్. పొందవచ్చునని, ఎఫ్ఐఆర్ స్థితిగతులు తెలుసుకోవచ్చునని తెలిపారు. వాహనాలకు ఈ చలాన్ వివరాలు తెలుసుకోవచ్చునని తెలిపారు. ప్రజలు వాట్సాప్ నెంబరు 95523 00009 కు హాయ్ పంపడం ద్వారా మన మిత్ర సేవలను ప్రారంభించి, అవసరమైన పోలీస్ సేవలను సులభంగా పొందవచ్చని తెలిపారు. ఈ డిజిటల్ గవర్నెన్స్ విధానం ద్వారా ప్రజలకు పోలీస్ శాఖ మరింత చేరువవుతూ, సేవలలో వేగం, పారదర్శకత మరియు నమ్మకం పెరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు.

రేపటి బాలోత్సవాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పెదనందిపాడు

మండల కేంద్రమైన పెదనందిపాడులో మంగళవారం జరిగే బాలోత్సవాలను జయప్రదం చేయాలని బాలోత్సవాల కన్వీనర్ మక్కెన జవహర్ రాణి కోరారు. తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో ఉదయం 10 గంటలకు బాలోత్సవాలు ప్రారంభమవు తాయని, పెదనందిపాడు, కాకుమాను మండలాలకు చెందిన ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల విద్యార్థులు సుమారు వెయ్యి మంది వివిధ పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శిస్తారని చెప్పారు. ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్సీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కె.ఎస్.లక్ష్మణరావు, విజ్ఞాన్ విద్యా సంస్థల అధినేత లావు రత్తయ్య, కాళహస్తి సత్యన్నారాయణ, దాసరి శేషగిరిరావు, ముద్దన రాఘవయ్య, అరవపల్లి కృష్ణమూర్తి, నర్రా బాలకృష్ణ, కొల్లా సాంబశివరావు, గుంటూరులోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు హాజరవుతారని, సాయంత్రం 4 గంటలకు బహుమతి ప్రదానోత్సవ సభ ఉంటుందని తెలిపారు.

పురస్కారం అందుకున్న ఉపాధ్యాయులతో అతిధులు, ఆకట్టుకున్న విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు

విద్యార్థుల్లో శాస్త్రీయ ధృక్పథాన్ని పెంపొందించాలి

ప్రజాశక్తి - గుంటూరు

విద్యార్థులలో శాస్త్రీయ ధృక్పదాన్ని పెంపొందించటానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని వక్తలు పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో కెవిఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ 15వ వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. సభలో ఎం.క్యూరీ సంకలనం చేసిన 'మానవతా మూర్తి మేడం క్యూరీ' పుస్తకాన్ని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్, 'ఆధునిక భారత శాస్త్రవేత్తలు' పుస్తకాన్ని చలపతి విద్యాసంస్థల చైర్మన్ వై.వి ఆంజనేయులు, 'బాలల కోసం భారత రాజ్యాంగ ప్రవేశిక' పుస్తకాన్ని మలినేని విద్యాసంస్థల అధినేత మలినేని పెరుమాళ్ళ ఆవిష్కరించారు. ఫిజికల్ సైన్స్‌లో విశిష్ట సేవా పురస్కారాన్ని రాయపాటి శివనాగేశ్వరరావుకు అందజేశారు. అలాగే 30 మంది ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు 'సి.వి.రామన్, మేడం క్యూరీ' ప్రతిభా పురస్కారాలతో సత్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక దశాబ్దాలుగా విద్యార్థుల్లో యువతలో శాస్త్రీయ ఆలోచన విధానం పెంపొందించేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నదని తెలియజేశారు. సభకు అధ్యక్షత వహించిన మాజీ ఎమ్మెల్సీ, జెవివి రాష్ట్ర అధ్యక్షులు కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సైన్స్ ఫెయిర్స్ ద్వారా విజ్ఞానాభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులను ఈ ఏడాది విశిష్ట సేవా ప్రతిభా పురస్కారాలు అందచేసినట్లు తెలిపారు. డాక్టర్ పెరుమాళ్ళ మాట్లాడుతూ టెక్నాలజీ పెరిగేకొద్దీ మానవ విలువలు తగ్గిపోతున్నాయని, వై.వి. ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పదం పెంపొందించటానికి, ఉపాధ్యాయుల్ని ప్రోత్సహించటానికి అనేక కార్యక్రమాలు చేపడుతున్న ట్రస్ట్‌ను అభినందించారు. జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సురేష్ మాట్లాడుతూ శాస్త్రవేత్తలు ఎవ్వరూ వందేళ్లు బతకలేదని, వారి వ్యక్తిగత జీవితాన్ని పరిశోధనల కోసం కేటాయించారని, వారి జీవితం మనకు స్ఫూర్తిదాయకం అన్నారు. పుస్తక రచయిత ఎం.క్యూరీ మాట్లాడుతూ తన చిన్న వయస్సులో ఆలిండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ కార్యక్రమాలు తన భవిష్యత్‌పై ఎంతో ప్రభావం చూపాయన్నారు. మేడం క్యూరీ శాస్త్రవేత్త మాత్రమే కాదని, గొప్ప మానవతా వాది అన్నారు. తన ఆవిష్కరణలు సమాజానికి ఉపయోగపడాలనే ఉద్దేశంతో పేటెంట్ పొందటానికి కూడా నిరాకరించా రన్నారు. సభలో కె.వెంకటేశ్వం ´రావు, జయలక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ట్రస్టు కార్యదర్శి కె.అలీన్, కె.విజయలక్ష్మి, యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్, బంధుమిత్రులు, తదితరులు పాల్గన్నారు. సభలో తొలుత ఎంవిఎస్ కోటేశ్వరరావు మెమోరియల్ స్కూల్ విద్యార్థినుల నృత్య ప్రదర్శన, పివి రమణ ఆధ్వర్యంలో మలినేని పెరుమాళ్ళ కాలేజి విద్యార్థినులు ప్రదర్శించిన కోలాటం, డప్పు ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

10, 11 తేదీల్లో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

ప్రజాశక్తి - గుంటూరు

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర 51వ కౌన్సిల్ సమావేశాలు జనవరి 10, 11 తేదీలలో గుంటూరులో నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదిరవారం బ్రాడీపేటలోని యుటిఎఫ్ హాలులో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 1993లో రాష్ట్ర మహాసభలు గుంటూరులో జరిగాయని తిరిగి 2026 జనవరిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావే శాలలో విద్యారంగ సమస్యలపై, ఉపాధ్యాయులపై ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిరంకుశ విధానాలపై చర్చించి భవిష్యత్తు పోరాట కార్యక్రమాలు రూపొందించుకోవటం జరుగుతుం దన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎన్. కుసుమ కుమారి మాట్లాడుతూ 10 పదవ తేదీ ఓపెన్ సెషన్ ఉంటుందని, ఇందులో పెద్ద ఎత్తున ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రచరణల కమిటీ చైర్మన్ ఎం. హనుమంతరావు మాట్లాడుతూ 10వ తేదీ బహిరంగ సభ, ఉపాధ్యాయుల ర్యాలీ ఉంటుంది, రెండవ రోజు ప్రతినిధుల సభ జరుగుతుందన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి కౌన్సిల్ 32ఏళ్లతరువాత గుంటూరులో జరుగుతుందని, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొనిజయప్రదం చేయాలని కోరారు. జిల్లా గౌరవాధ్యక్షులు పి.వి.శ్రీనివాస రావు, జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, జిల్లా సహాధ్యక్షురాలు ఎండి షకీలా బేగం, జిల్లా కోశాధికారి మహమ్మద్ గయా సుదౌలా, జిల్లా కార్యదర్శులు ఆదినారాయణ, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, రంగారావు, కామాక్షి, ప్రసాదు, కేదార్నాథ్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

మూత్ర వ్యవస్థ పట్ల నిర్లక్ష్యం వహించకూడదు

ప్రజాశక్తి - గుంటూరు

మూత్ర వ్యవస్థ పట్ల నిర్లక్ష్యం వహించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ పి.రఘుశరత్ అన్నారు. అవగాహనసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అరండల్ పేటలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ఆరోగ్య సభలో డాక్టర్ రఘుశరత్ మాట్లాడుతూ సాధారణంగా వయసు మీదపడే కొద్దీ మూత్ర సంబంధిత సమస్యలు వస్తాయన్నారు. ముఖ్యంగా ప్రొస్టేట్ గ్రంధి పరిమాణం వయసుతో పాటు పెరుగుతుందని, ఆ సందర్భాలలో మూత్రనాళంపై ఒత్తిడి ఏర్పడి, మూత్రం సన్నగా రావడం, ఆగిఆగి రావడం, పూర్తిగా మూత్ర విసర్జన అవకపోవడం లాంటి సమస్యలు తలెత్తుతాయి అన్నారు. మూత్రపిండ సమస్యలపై మాట్లాడుతూ మధుమేహం వల్లగానీ, అధిక రక్తపోటు వల్ల గానీ మూత్రపిండాలకు రక్తాన్ని సరఫరా చేసే నరాలు దెబ్బ తినడం ద్వారా గానీ, ఉప్పు, చక్కెర లాంటి పదార్థాలను, హైప్రొటీన్ కలిగిన పదార్థాలను ఎక్కువగా ఆహారంలో తీసుకోవడం వల్లగానీ మూత్రపిండ సమస్యలు తలెత్తుతా యన్నారు. ప్రొస్టేట్ క్యాన్సర్ గురించి వివరిస్తూ సాధార ణంగా పెద్ద వయసు వారిలో ప్రొస్టేట్ గ్రంధి పరిమాణం పెరుగుతుం దన్నారు. సభకు టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, సభలో అనవేమా ట్రస్ట్ అధ్యక్షు లు చల్లా అంజిరెడ్డి, సీనియర్ న్యాయవాది ఎస్ఎం సుభాని, ఆదిత్య మెడికవర్ హాస్పిటల్ పిఆర్ఓలు రాఘవ, ఉమామహేశ్వరరావులు పాల్గొన్నారు.

ప్రకృతి, సమాజ చిత్రాలు పాణిరావు కవితలు

ప్రజాశక్తి - గుంటూరు

యర్రగుంట్ల పాణిరావు కవితలు ప్రకృతి సమాజ చిత్రాలని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని జాషువా విజ్ఞాన కేంద్రంలో పాణిరావు రచించిన 'నీరెళ్ళిపోతున్నా నది నాతోనే' కవితల సంపుటి ఆవిష్కరణ సభ నిర్వహించారు. అమరావతి సాహితీ మిత్రులు అధ్యక్షులు డాక్టర్ రావి రంగారావు అధ్యక్షతన జరిగిన సభలో భూసురపల్లి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై పాణిరావు కవితల సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. జీవ లక్షణం ఉన్న కవిగా పాణిరావును అభినందించారు. జ్ఞాపకాలను చాలా అందంగా చిత్రించారని చెప్పారు. మానవ సంబంధాలను అద్భుతమైన భావుకత జోడించి బాగా చెప్పారన్నారు. ప్రముఖ సాహితీవేత్త అబ్దుల్ రజా హుస్సేన్ కవిని గురించి, కవిత్వ సంపుటి గురించి మాట్లాడుతూ ప్రజలను మేలుకొలిపే కవిత్వంగా, చక్కని ఆలోచనలు ఉన్న కవిత్వంగా మంచి కవిత్వం అందించారని పాణిరావు అభినందించారు. విమల సాహితీ వేదిక (హైదరాబాద్) అధ్యక్షులు డాక్టర్ జెల్ది విద్యాధరరావు మాట్లాడుతూ నవ్యత, మానవత, ఆకుపచ్చని జ్ఞాపకాలతో కవిత్వ సంపుటి పరిమళాలు వెదజల్లుతూ ఉందని అన్నారు. ఈ సందర్భంగా పాణిరావును అమరావతి సాహితీ మిత్రులు సంస్థ పక్షాన డాక్టర్ రావి రంగారావు, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, విద్యాధరరావు, రజా హుస్సేన్, సురేష్, గుంటూరు జిల్లా రచయితల సంఘం ప్రతినిధులు, పలువురు సాహితీవేత్తలు బంధువులు సత్కరించారు. కవిత్వ రచనకు, ప్రచురణకు సహకరించిన కవి మిత్రులందరికీ పాణిరావు కృతజ్ఞతలు తెలియజేశారు. సభలో పాణిరావు తన సోదరి వాణీసుమకు తొలి ప్రతిని అందచేశారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ భూసురుపల్లి వెంకటేశ్వర్లు, సాహితీవేత్తలు